కరీంనగర్ వార్త



కరీంనగర్ - జగిత్యాల - పెద్దపల్లి - రాజన్నసిరిసిల్ల

సోమవారం 6, జూలై 2026 16 పేజీలు

సర్ సవరణపై.. అయోమయం!



16వ పేజీలో...

బిడ్జి నిర్మాణం పూర్తయ్యేది ఎప్పుడో?

2 లో..



బిల్లులు మంజూరుకాక మధ్యలోనే నిలిచిపోయిన వంతెన పనులు

గ్రామస్తులకు తప్పని తిప్పలు

ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త:

ఇబ్రహీంపట్నం మండలంలోని యామాపూర్-ఫకీర్ కొండాపూర్ గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న హై లెవెల్ వంతెన పనులు బిల్లులు మంజూరుకాక నిలిచిపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫకీర్ కొండాపూర్ గ్రామానికి వెళ్లేందుకు రెండు రహదారులు మాత్రమే ఉన్నాయి. ఒకటి యామాపూర్ మీదుగా, మరొకటి మల్లాపూర్ మండలం నడికుడ గ్రామం మీదుగా వెళ్తుంది. ఈ రెండు మార్గాల్లోనూ లో లెవెల్ వంతెనలు ఉండటంతో ప్రతి వర్షాకాలంలో వాగులు ఉప్పొంగి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. అయితే ఇటీవల నడుకుడా ఫకీర్ కొండాపూర్ మధ్యగల లో లెవెల్ వంతెనను హై లెవెల్ వంతెనగ మార్చారు. అయితే పకీరు కొండాపూర్ గ్రామస్తులు ఎక్కువగా యామాపూర్ మీదుగా మెట్ పెల్లికి వెళ్తారు అలాగే ఆర్టీసీ బస్సు కూడా యామాపూర్ మీదుగానే సౌకర్యం కాదు. ప్రత్యామ్నాయ మార్గం లేక గ్రామస్తులు, విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వరదల సమయంలో విద్యార్థులకు యామాపూర్ గ్రామంలో తాత్కాలిక బస ఏర్పాటు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి.

పెద్దబొంకూర్‌లో రెచ్చిపోతున్న

ఇసుక, మొరం మాఫియా



16వ పేజీలో...

- నిబంధనలకు విరుద్ధంగా రాత్రి, పగలు వాహనాలతో తరలింపు
- ఫిర్యాదు చేసిన పట్టించుకోని ఉన్నతాధికారులు
- అడ్డుకోబోయినందుకు చంపుతామని బెదిరింపులు

పెద్దపల్లి రూరల్, ప్రభాతవార్త:

పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ గ్రామంలోని హుస్సేమియా వాగు పరిసర ప్రాంతాల్లో ఇసుక, మొరం మాఫియా రెచ్చిపోతుందని 9వ వార్డు సభ్యుడు వెంగళ కనకయ్య అన్నారు. ఎలాంటి పర్మిషన్లు లేకుండా, నిబంధనలను బేఖాతరు చేస్తూ రాత్రింబవళ్లు యంత్రాలు, వాహనాలతో ఇసుక, మొరాన్ని యథేచ్ఛగా తరలిస్తున్నారన్నారని ఆరోపించారు. దీంతో గ్రామంలోని అంతర్గత రహదారులు పూర్తిగా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

పుష్కరాల నాటికి

ఆలయాలకు ప్రత్యేక శోభ..

ముఖ్యమంత్రి ముందుచూపుతో పుష్కర పనులు..

రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..



2 లో..

వెల్గటూర్ ప్రభాత వార్త.

గోదావరి పుష్కరాలకు ముందే గోదావరి తీరంలోని ఆలయాలకు కొత్త శోభ తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు5 సాగుతుందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. 5 ఆదివారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల గ్రామంలోని శ్రీ కోటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు గోదావరి పుష్కరాలకు ఏడాది ముందుగానే ఏర్పాట్లు చేయడానికి బడ్జెట్ లో నిధులు కేటాయించారని

బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేది ఎప్పుడో?

బిల్లులు మంజూరుకాక మధ్యలోనే నిలిచిపోయిన వంతెన పనులు

గ్రామస్తులకు తప్పని తిప్పలు

ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త:

ఇబ్రహీంపట్నం మండలంలోని యామాపూర్-ఫకీర్ కొండాపూర్ గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న హై లెవెల్ వంతెన పనులు బిల్లులు మంజూరుకాక నిలిచిపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫకీర్ కొండాపూర్ గ్రామానికి వెళ్లేందుకు రెండు రహదారులు మాత్రమే ఉన్నాయి. ఒకటి యామాపూర్ మీదుగా, మరొకటి మల్లాపూర్ మండలం నడికుడ గ్రామం మీదుగా వెళ్తుంది. ఈ రెండు మార్గాల్లోనూ లో లెవెల్ వంతెనలు ఉండటంతో ప్రతి వర్షాకాలంలో వాగులు ఉప్పొంగి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. అయితే ఇటీవల నడుకుడా ఫకీర్ కొండాపూర్ మధ్యగల లో లెవెల్ వంతెనను హై లెవెల్ వంతెనగ మార్చారు. అయితే పకీరు కొండాపూర్ గ్రామస్తులు ఎక్కువగా యామాపూర్ మీదుగా మెట్ పెల్లికి వెళ్తారు అలాగే ఆర్టీసీ బస్సు కూడా యామాపూర్ మీదుగానే సౌకర్యం కాదు. ప్రత్యామ్నాయ మార్గం లేక గ్రామస్తులు, విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వరదల సమయంలో విద్యార్థులకు యామాపూర్ గ్రామంలో తాత్కాలిక బస ఏర్పాటు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి.ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా అప్పటి కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు రూ.2.77 కోట్ల ఆర్అండ్బీ నిధులతో యామాపూర్-ఫకీర్ కొండాపూర్ గ్రామాల మధ్య హై లెవెల్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మెట్పల్లికి చెందిన హిమాలయ కన్స్ట్రక్షన్స్ సంస్థ పనులు చేపట్టి ప్రస్తుతం సుమారు 80 శాతం పనులు పూర్తి చేసింది. వంతెన పిల్లర్ల నిర్మాణం పూర్తయినప్పటికీ ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా బిల్లు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశాడు. గత వర్షాకాలంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రహదారి రెండుసార్లు వరదలకు కోతకు గురైంది. కాంట్రాక్టర్ తాత్కాలిక మరమ్మతులు చేసినా, గ్రామస్తులే స్వయంగా రహదారిని పునరుద్ధరించి రాకపోకలు కొనసాగించారు. ప్రస్తుతం మరోసారి వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో మళ్లీ తాత్కాలిక రహదారి కోతకు గురై రాకపోకలు నిలిచిపోతాయేమోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెన పూర్తయితే నిర్మల్ జిల్లా ఖానాపూర్, కడెం తదితర ప్రాంతాలకు ప్రయాణ దూరం గణనీయంగా తగ్గడంతో పాటు గ్రామస్తులకు శాశ్వత రవాణా సౌకర్యం కలుగుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని పెండింగ్ బిల్లులు మంజూరు చేసి వంతెన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వంతెన నిర్మాణం పూర్తయ్యేలా చూడాలి-
ఎల్లా శ్రీనివాస్,

బీజేపీ ఇబ్రహీంపట్నం మండల ప్రధాన కార్యదర్శిఫకీర్ కొండాపూర్ గ్రామానికి ఉన్న రెండు రహదారులు వర్షాకాలంలో వరదల కారణంగా మూసుకుపోతున్నాయి. దీంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడం, రైతులు తమ పొలాలకు చేరుకోవడం కష్టసాధ్యంగా మారుతోంది. తాత్కాలిక రహదారి కోతకు గురైతే వారం నుంచి పది రోజుల వరకు గ్రామం బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి బిల్లులు మంజూరు చేసి వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలి.





పుష్కరాల నాటికి ఆలయాలకు ప్రత్యేక శోభ..

ముఖ్యమంత్రి ముందుచూపుతో పుష్కర పనులు..

రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..

వెల్గటూర్ ప్రభాత వార్త.

గోదావరి పుష్కరాలకు ముందే గోదావరి తీరంలోని ఆలయాలకు కొత్త శోభ తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు5 సాగుతుందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.5 ఆదివారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల గ్రామంలోని శ్రీ కోటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు గోదావరి పుష్కరాలకు ఏడాది ముందుగానే ఏర్పాట్లు చేయడానికి బడ్జెట్ లో నిధులు కేటాయించారని మంత్రి అన్నారు. గోదావరి తీరం వెంట బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి క్షేత్ర అభివృద్ధికి నిధులు కేటాయించడంతో పాటు కోటిలింగాలలోని కోటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించినట్లు మంత్రి వివరించారు. ధర్మపురి నియోజకవర్గానికి పుష్కర పనుల కోసం రూ.117 కోట్లు కేటాయించగా ఇందులో కోటిలింగాలలో పుష్కర ఘాట్ నిర్మాణానికి రూపాయలు 8 కోట్లు కోటిలింగాల నుండి పాశిగాం వరకు రోడ్డు నిర్మాణానికి రూ. 8 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు.ధర్మపురి ఉగ్ర నరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి రూ. 10 కోట్లు కేటాయించగా వెల్గటూర్ నుండి కోటిలింగాల వరకు నాలుగు లైన్ల రహదారి విస్తరణ కొరకు రూ. 20 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. కోటిలింగాలతోపాటు రాజక్క పల్లి వద్ద మిని ట్యాంక్ బండ్ మాదిరిగా నిర్మాణం చేస్తామని మంత్రి తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత..

కోటిలింగాల గ్రామానికి చెందిన మంచి కట్ల మణితేజ ఇటీవల కుక్క కాటుకు గురై మరణించగా ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5లక్షల చెక్కును మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఈ సందర్భంగా మణితేజ కుటుంబ సభ్యులకు మంత్రి అందజేశారు.

గృహప్రవేశంలో పాల్గొన్న మంత్రి అడ్లూరి.

.వెల్గటూర్ మండల కేంద్రంలో ప్రభుత్వం మంజూరు చేసిన సింగం రాజేశ్వరి తిరుపతి ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.





బురద రహదారితో రైతులకు తీవ్ర ఇబ్బందులు

రహదారి అంతా గుంతల మయం

ప్రజా ప్రతినిధులు స్పందించి నూతన రహదారి ఏర్పాటు చేయాలని రైతుల వేడుకోలు

కామేపల్లి, జూలై 5 ప్రభాతవార్త:

కామేపల్లి మండలం ముచ్చర్ల నిమ్మ వాగు నుంచి కట్టు వరకు వెళ్లే రైతుల పంట పొలాల రహదారి దుస్థితిలో ఉండటంతో అన్నదాతలు అనేక ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.రహదారి మొత్తం గుంతలతో బురదమయంగా మారడంతో పాటు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగిపోయాయి.దీంతో రైతులు పంట చేలకు వెళ్లడం దినదిన గండంగా మారింది.ట్రాక్టర్లు, బండ్లు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.ఎరువులు, పురుగుమందులు తీసుకెళ్లడం,పండిన పంటను మార్కెట్కు తరలించడం చాలా కష్టంగా ఉంది.వర్షాకాలంలో అసలు రాకపోకలు సాధ్యం కావడం లేదు అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు.అనేకమార్లు విన్నవించినా ఫలితం లేదని వాపోయారు.ఈ సమస్యపై అనేక మార్లు సంబంధిత అధికారులకు వినతులు ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో స్థానిక సర్పంచ్ జాటోత్ జాయ్ లూసీ ఆదివారం ఉపాధి హామీ పథకం ఈసీ దామాల వెంకటేశ్వర్లు,రైతులతో కలిసి రహదారిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రహదారి దుస్థితిని చూసిన సర్పంచ్ వెంటనే స్పందించి ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ,జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.నూతనంగా రహదారి ఏర్పాటు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని రైతులకు భరోసా ఇచ్చారు.

చికిత్స పొందుతూ ప్రవేట్ ఎలక్ట్రిషియన్ మృతి

నేలకొండపల్లి, జూలై 5 ప్రభాతవార్త :

బోదులబండ గ్రామం నందు ప్రమాదవశాత్తు విద్యుత్ షాకు కు గురై ప్రవేట్ ఎలక్ట్రిషియన్ షేక్. జమీర్ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఇందుకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని బోదులబండ గ్రామ పంచాయతీలో ప్రవేట్ ఎలక్ట్రిషియన్ గా విధులు నిర్వహిస్తున్న షేక్. జమీర్ (42) గత వారం రోజుల క్రితం పంచాయతీ లో వీధి లైట్లు వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కు గురై తీవ్ర గాయాలైయ్యాయి. స్థానికులు నేలకొండపల్లి ప్రభుత్వ హస్పిటల్ లో ప్రధమ చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. ఖమ్మం లో పరిస్థితి విషమించటంతో హైద్రాబాద్ కు తరలించారు. వారం రోజుల నుంచి అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. షేక్. జమీర్ మృతి పట్ల బోదులబండ గ్రామ సర్పంచ్ కట్టెకోల నాగార్జున, పంచాయతీ కార్యదర్శి ఆలీలు సంతాపంను తెలిపారు.

గంజాయి అక్రమ రవాణాపై పాల్వంచ పోలీసుల ఉక్కుపాదం.

రూ.14.45 లక్షల,28.9 కిలోల గంజాయి స్వాధీనం.....ఒకరు అరెస్ట్.

పాల్వంచ టౌన్,జూలై 5,ప్రభాత వార్త:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణ పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం,పాల్వంచ పట్టణ పరిధిలోని ప్రియదర్శిని కాలనీకి చెందిన ఉప్పుగుండ్ల ప్రభాకర్ అనే వ్యక్తి ఒడిశా రాష్ట్రంలోని కలిమెల నుంచి మహబూబాబాద్కు ఆటోలో 28.9 కిలోల గంజాయిని తరలిస్తున్నాడు.ఈ మేరకు పాల్వంచ పట్టణంలోని సంజయ్ నగర్ వద్ద చేపట్టిన వాహన తనిఖీల్లో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.14.45 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.నిందితుడి వద్ద నుంచి రూ.34 వేల నగదు,ఒక సెల్ఫోన్,గంజాయి తరలింపుకు ఉపయోగించిన ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనలో మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉండగా,వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పాల్వంచ టౌన్ పోలీసులు వెల్లడించారు.

దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

నార్కట్ పల్లి ప్రభాతవార్త జూలై 05

తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతి సందర్భంగా మండలంలోని యల్లారెడ్డిగూడ గ్రామంలో గొల్ల కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నార్కట్పల్లి మండల అధ్యక్షుడు కత్తుల దాస్ మహాజన్ హాజరై దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈనెల 6న సోషల్ వెల్ఫేర్ గురుకుల ఇంటర్మీడియట్ స్పాట్ కౌన్సిలింగ్

పెద్దపల్లి జిల్లా సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ సమన్వయ అధికారి ఉటూరి శ్రీనాథ్

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:



ఈనెల 6న సోషల్ వెల్ఫేర్ గురుకుల ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని పెద్దపల్లి జిల్లా సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ సమన్వయ అధికారి ఉటూరి శ్రీనాథ్ తెలిపారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ సమన్వయ అధికారి ఉటూరి శ్రీనాథ్ ఒక ప్రకటన విడుదల చేస్తూ పెద్దపల్లి జిల్లాలో ఉన్నటువంటి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల మంథని, పెద్దపల్లి బాలుర కళాశాలల్లో, రామగుండం, మల్లాపూర్, నంది మేడారం, గర్రెపల్లి బాలికల కళాశాలల్లో మిగిలిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచఈసీ సీట్లకు 6వ తేదీన సోమవారం స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రవేశ పరీక్షలో ప్రతిభ ద్వారా రెండు విడతల్లో సీట్ల భర్తీ చేయడం జరిగిందని పెద్దపల్లి జిల్లా సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ సమన్వయ అధికారి ఉటూరి శ్రీనాథ్ వివరించారు. మిగిలిన సీట్లకు స్పాట్ కౌన్సిలింగ్ ను తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల లేదా కళాశాల బాలురు మంథనిలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రిజిస్ట్రేషన్ ఉంటుందని ఆ తర్వాత స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామని వివరించారు. స్పాట్ కౌన్సిలింగ్ కు హాజరయ్యే అర్హులైన అభ్యర్థులు సంబంధిత విద్యార్హత 10వ తరగతి ఉత్తీర్ణత పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం ఒరిజనల్ ధ్రువపత్రాలతో పాటు జిరాక్స్ పత్రాలు 2 సెట్లు, విద్యార్థి ఆధార్ కార్డు జిరాక్స్, తల్లిదండ్రుల ఆధార్ కార్డు జిరాక్స్, విద్యార్థి 4 ఫోటోలు తీసుకొని కౌన్సిలింగ్ సెంటర్ కు రావాలని సూచించారు.

మహిళలపై హింస అరికట్టేందుకు కఠిన చర్యలు అవసరం

పీఓడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కే. జ్యోతి

ఎన్‌టీపీసీ, ప్రభాతవార్త:





మహిళలపై పెరుగుతున్న హింస, అత్యాచారాలు, గృహహింస, లైంగిక వేధింపులను అరికట్టేందుకు ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కోడిపుంజుల జ్యోతి డిమాండ్ చేశారు. ఆదివారం ఎన్‌టీపీసీలో నిర్వహించిన పీఓడబ్ల్యూ నిర్మాణ జనరల్ బాడీ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చి నేరస్థులకు కఠిన శిక్షలు విధించేలా చట్టాలను సమర్థంగా అమలు చేయాలని కోరారు.తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలు, ముఖ్యంగా రూ.2,500 ఆర్థిక సాయం సహా ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.అనంతరం పీఓడబ్ల్యూ ఎన్‌టీపీసీ పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షురాలిగా ఏ. లక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా ఓ. సంధ్య, ప్రధాన కార్యదర్శిగా పి. కవిత, సహాయ కార్యదర్శిగా రజిత, కోశాధికారిగా కె. రాధ, ఆర్గనైజేషన్ కార్యదర్శులుగా ఓ. శారద, ఆర్. మండమ్మ, పి. విజయలక్ష్మి, ఎస్. భాగ్య మ్మ, సభ్యులుగా ఎస్. రాయమల్లమ్మ, ఎస్. ఓదమ్మలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిలక శంకర్, జిల్లా నాయకులు పి. స్వామి, బి. కొమురయ్య, డి. రవి, ఆర్. రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

బీర్పూర్ లో భారీ దొంగతనం..

తాళం వేసిన ఇంట్లో 4.75 తులాల బంగారం,

65 తులాల వెండి మాయం!

బీర్ పూర్ ప్రభాత వార్త



జగిత్యాల జిల్లా బీర్పూర్ మండల కేంద్రంలో శని, ఆదివారాల మధ్య భారీ దొంగతనం చోటుచేసుకుంది. వృద్ధ దంపతులు శుభకార్యానికి వెళ్లిన సమయాన్ని ఆసరాగా చేసుకుని దొంగలు ఇల్లాలు దాచుకున్న సొమ్మును దోచుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...బీర్పూర్ గ్రామానికి చెందిన మధిరె గంగయ్య (84), తండ్రి ఎల్లయ్య అనే వృద్ధుడు తన భార్య రాజనర్సుతో కలిసి స్థానికంగా నివసిస్తున్నాడు. ఈ నెల 3వ తేదీ (శుక్రవారం) ఉదయం సుమారు 6:30 గంటల సమయంలో జగిత్యాల మండలం లక్ష్మీపూర్ గ్రామంలోని తమ కుమార్తె కొత్త ఇంటి గృహప్రవేశ వేడుకకు వెళ్లారు. ఇందుకోసం వారు తమ ఇంటికి తాళం వేసి వెళ్లారు.శుభకార్యం ముగించుకుని (ఆదివారం) ఉదయం 11:30 గంటల ప్రాంతంలో దంపతులు తిరిగి ఇంటికి చేరుకున్నారు. ఇంటి ప్రధాన ద్వారానికి వేసిన తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించి వారు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. లోపలికి వెళ్లి చూడగా, ఇంట్లో వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి.గంగయ్య తన ఇంట్లోని ఒక మట్టి కుండలో, గుడ్డలో మూటకట్టి భద్రపరుచుకున్న 4.75 తులాల బంగారు ఆభరణాలు, అలాగే 65 తులాల వెండి వస్తువులను దుండగులు దొంగిలించుకుపోయారనీ బాధిత వృద్ధుడు మధిరె గంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీర్పూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలు సేకరిస్తున్నామని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని బీర్పూర్ సబ్ ఇన్స్పెక్టర్ రాజు తెలిపారు.



నేరాలు-దారుణాలు

ఆదివారంపేట లో తెల్లవారుజామున జేసీబీ దగ్ధం

యజమాని కన్నీటి పర్యంతం

కుట్ర కోణంపై అనుమానాలు

రామగిరి ప్రభాతవార్త



రామగిరి మండలంలోని ఆదివారంపేట గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకున్న జేసీబీ దగ్ధ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గ్రామానికి చెందిన ఏలువాక వెంకటేష్ కు చెందిన జేసీబీ తెల్లవారుజామున సుమారు 3 గంటల ప్రాంతంలో పూర్తిగా మంటల్లో కాలిపోయింది.ఘటన సమాచారం అందుకున్న రామగిరి ఎస్ఐ తాడవేని శ్రీనివాస్ వెంటనే పోలీసు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. జేసీబీ ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైందా, లేక గుర్తుతెలియని వ్యక్తులు కావాలనే నిప్పంటించారా అనే కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్ఐ తెలిపారు.ఇక జేసీబీ యజమాని వెంకటేష్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ల కష్టార్జితంతో కొనుగోలు చేసిన జేసీబీ ఒక్కసారిగా అగ్నికి ఆహుతి కావడంతో కన్నీటి పర్యంతమయ్యారు. తన వాహనాన్ని కొందరు కావాలనే కుట్రపూరితంగా దగ్ధం చేసి ఉండవచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. అసలు కారణాలు ఏమిటన్నది పోలీసుల విచారణలో తేలనుంది.

కారు ఢీకొని యువకుని మృతి

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:



నగరంలోని బస్టాండ్ సమీపంలో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వన్ టౌన్ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బస్టాండ్ అవుట్ గేట్ సమీపంలో శనివారం అర్ధరాత్రి వేగంగా వచ్చిన తెలుపు రంగు నెక్సా కారు రోడ్డు దాటుతున్న యువకుడ్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో యువకుడు సుమారు 20 మీటర్ల దూరం గాల్లో ఎగిరి పడటంతో ఘటనా స్థలాల్లోనే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన తర్వాత కారు ఆపకుండా వెళ్లిపోవడంతో స్థానికులు అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామ నిర్వహించగా మృతునికి సంబంధించి వివరాలు లభ్యం కాలేదు. మృతుడు సుమారు 5:30 అడుగుల ఎత్తు కలిగి ఉండి ఎడమ చేతిపై టాటూ ఉందని సంబంధీకులు ఎవరైనా ఉంటే వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని ఇన్స్పెక్టర్ రామచంద్రరావు తెలిపారు. ప్రమాదానికి కారణమైన వాహనం దాని డ్రైవర్ను గుర్తించేందుకు సీసీ కెమెరాల రికార్డులను పరిశీలిస్తున్నామని ఇన్స్పెక్టర్ తెలిపారు.

ప్రేమించి.... పెళ్లి చేసుకొని ఆపై తనువు చాలించి...

భార్య కారణమన్న యువకుని తల్లిదండ్రులు

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:

ప్రేమించుకున్నారు... పెద్దలను కాదని పెళ్లి చేసుకున్నారు. కలకాలం కలిసి ఉండాలని ఒకటైన ఆ ఇద్దరు మనస్పర్ధలు కారణంగా యువకుని బలవన్మరణం ఆ బంధానికి ముగింపు పలికింది. అయితే కట్టుకున్న భార్య వేధింపులకు గురి చేయడంతోనే తన కొడుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు సంచలనంగా మారింది. కరీంనగర్ మండలం తీగల గుట్టపల్లి లో జరిగిన ఈ నటన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపెల్లి మండలానికి చెందిన కళ్యాణం రాకేష్ (27) హైదరాబాద్ కు చెందిన సంజన అలియాస్ వర్షా (30) ఇరువురు ప్రేమించుకుని వివాహం చేసుకున్నారు. 2024 లో పెద్దలను ఎదిరించి కులాంతర వివాహం చేసుకున్న ఆ ఇద్దరు తీగలగుట్టపల్లిలో కొత్త కాపురం ప్రారంభించారు. రాకేష్ శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో



ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న రాకేష్ తల్లిదండ్రులు అక్కడికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించారు. మృతుని తండ్రి రవి ఇచ్చిన సమాచారం మేరకు తన కొడుకును కుటుంబ సభ్యులను కలవకుండా ఉండాలని బంగారు ఆభరణాలు తేవాలని రాకేష్ భార్య సంజన మానసికంగా హింసించడంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. తన కొడుకుని కనీసం ఫోన్లో కూడా మాట్లాడకుండా వేధింపులకు గురి చేసిందని ఆ వేధింపులు తట్టుకోలేక తన కొడుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడని లిఖితపూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి తెలిపారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కు తరలించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు.

పెంబర్తి వద్ద కేటీఆర్ కాన్వాయ్ అడ్డుకున్న పోలీసులు

- కన్నెపల్లి పంప్‌హౌస్ పర్యటనలో ఉద్రిక్తత

ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :

జనగామ జిల్లా కన్నెపల్లి పంప్‌హౌస్ సందర్శనకు వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కాన్వాయ్‌ను పోలీసులు పెంబర్తివద్ద బారికేడ్లు ఏర్పాటుచేసి అడ్డుకోవడంతో ఆదివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు





అంతరాయం ఏర్పడింది.కన్నెపల్లి పంప్ హౌస్ పర్యటనకోసం హైదరాబాద్ నుంచి బయలుదేరిన కేటీఆర్‌వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అయితే పెంబర్తి సమీపంలో పోలీసులు రోడ్డుకుఅడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేసి కాన్వాయ్‌ను నిలిపివేశారు. దీంతో కేటీఆర్ వాహనం నుంచి దిగి పోలీసు అధికారులతో మాట్లాడారు.శాంతియుతంగా పంప్ హౌస్‌ను సందర్శించేందుకు వెళ్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని కేటీఆర్ పోలీసులను ప్రశ్నించినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.



ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.కేటీఆర్ కాన్వాయ్‌ను అడ్డుకున్నారనే సమాచారం తెలిసి జనగామ జిల్లా పరిసర ప్రాంతాలనుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెంబర్తికి చేరుకోవడంతో అక్కడ జనసందోహం పెరిగింది. పరిస్థితి అదుపులో ఉండేలా పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటుచేసి, ట్రాఫిక్‌ను నియంత్రించారు.

- కోమల్ల టోల్‌ప్లాజా వద్ద కేటీఆర్‌ను అడ్డుకున్న పోలీసులు..:

కన్నెపల్లి పంప్‌హౌజ్ సందర్శనకు తరలివెల్లుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను రఘునాథపల్లి మండలంలోని కోమల్ల టోల్‌గేట్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో వాగ్వాదం జరుగగా టోల్‌ప్లాజావద్ద అరగంటపాటు ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. ఈ చర్యను బీఆర్ఎస్ నాయకులు ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు సాగునీరు అందించాలనే సంకల్పంతో కన్నెపల్లి పంపుహౌజ్ కార్యక్రమానికి వెల్లుతున్న కేటీఆర్‌ను పోలీసులు అడ్డుకోవడం పిరికిపందల చర్యగా అభివర్ణించారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా బీఆర్ఎస్‌పార్టీ ప్రజలపక్షాన ఉండి పోరాడుతుందన్నారు. అంతకుముందు మండలంలోని బీఆర్ఎస్ నాయకులను ముందుస్తూగా ఆరెస్టు చేసిన పోలీసులు వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

కోరుట్ల వార్త



ఈ నెల 7న ఉచిత నేత్ర వైద్య, చికిత్సా శిబిరం

కోరుట్ల, ప్రభాతవార్త :

లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల, డిస్ట్రిక్ట్ 320బి, రీజియన్-iజు, జోన్-iజు ఆధ్వర్యంలో ప్రజలకు ఉపయోగపడే ఉచిత నేత్ర వైద్య, చికిత్సా శిబిరంను జూలై 7న నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు గుంటుక మహేష్, శ్రీనివాసరావు తెలిపారు.ఈ శిబిరం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు కోరుట్లలోని గాంధీ రోడ్ లో గల పద్మశాలి కళ్యాణ భవనంలో నిర్వహించబడుతుందన్నారు. శిబిరంలో పాల్గొనే ప్రతి ఒక్కరికి అనుభవజ్ఞులైన నేత్ర వైద్యులచే కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేయనున్నారు. కంటి శుక్లాలు (క్యాటరాక్ట్) ఉన్నట్లు గుర్తించిన రోగులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించేందుకు ఏర్పాట్లు చేయబడతాయని నిర్వాహకులు తెలిపారు.ప్రత్యేకంగా తెల్లకన్ను, నల్లకన్ను (క్యాటరాక్ట్) సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కోశాధికారి పొలాస రవీందర్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాలు

కోరుట్ల, ప్రభాతవార్త :



పట్టణంలోని ఐలాపూర్ రోడ్లో గల శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయంలో ముదిరాజ్ సంఘం నాయకులు ఘనంగా బోనాలు నిర్వహించారు. బోనాలను నెత్తిన పెట్టుకొని పురవీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతరాజుల విన్యాసాలు శివశక్తుల పూనకాల మధ్య ఆలయ ప్రాంగణం మార్మోగగా, పెద్ద ఎత్తున భక్తుల రాకతో ఆలయం కీటకటలాడింది. ఈ వేడుకల కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ తిరుమల వసంత గంగాధర్లు, పలు వార్డుల కౌన్సిలర్లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించకుండా ఆలయ పక్షాన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు, భక్తులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రథమ సంవత్సరం స్పాట్ అడ్మిషన్లు

మేడిపల్లి, ప్రభాతవార్త :



తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో 202627 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీ కోసం జూలై 6న సాంఘిక సంక్షేమ కళాశాల టి టీజీఎస్డబ్ల్యూఆర్ఈఐఎస్ /జేసీ బాలుర మేడిపెల్లి లో స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయ అధికారి బండి బాబు ప్రకటించారు. జగిత్యాల్ జిల్లా పరిధిలో గల (05) సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల/కళాశాల (బాలికలు మెట్ పల్లి, జగిత్యాల్), బాలురు కోరుట్ల, మేడిపెల్లి, గొల్లపల్లి(మగ్గిడి)) కళాశాలల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ చేసేందుకు సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల మేడిపెల్లి మండలంలో, స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించబడుతుందని ఆయన తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు స్పాట్ కౌన్సిలింగ్ కు అవసరమైన ద్రువపత్రాలతో తేదీ 6 జులై సోమవారం రోజున ఉదయం 9గంటల నుండి 12గంటల వరకు రిజిస్ట్రేషన్ జరుగుతుందని అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో పాటు జిరాక్స్ కాపీ సెట్లను తీసుకొని రావాలని ఏవైనా సందేహాలు ఉంటే ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ ను సంప్రదించాలన్నారు.

పచ్చదనంతో ప్రయాణికులను ఆకర్షిస్తున్న రోడ్డుమార్గం



చిల్పూర్, జూలై 5 ప్రభాతవార్త :

చిన్నపెండ్యాల నుంచి తరిగొప్పుల వెళ్లే రోడ్డుమార్గంలో పచ్చనిచెట్లతో రంగురంగు పువ్వులతో ప్రయాణికులను మై మరిపించేవిధంగా అందగా కనిపిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు ఆగి ఆకర్షిస్తున్న అందాలతో ఫోటోలు దిగుతున్నారు. ప్రయాణీకులను ఆనందంపరుస్తున్న పచ్చని రోడ్డుమార్గం. రహదారికి ఇరువైపులా ప్రకాశవంతమైన నారింజ, ఎరుపురంగుచెట్లు పందిరిలాంటి ప్రభావాన్ని సృష్టిస్తుంది. ఈ దృశ్యం చిన్నపెండ్యాల నుండి చిల్పూర్ దేవస్థానం వెళ్లేమార్గంలో కనిపిస్తుంది. చెట్లు వాటి విశాలమైన కొమ్మలతో చక్కని నీడను ఇవ్వడమే కాకుండా, పర్యావరణానికి అందాన్ని చేకూరుస్తున్నాయి. సాధారణంగా ఎండాకాలంలో (ఏప్రిల్ నుండి జూన్ వరకు) పూస్తాయి. ఆ సమయంలో చెట్టుమొత్తం ఆకుపచ్చని ఆకులకంటే ఎరుపు లేదా నారింజరంగు పూలతోనే ఎక్కువగా కనిపిస్తుంది. కేవలం అందానికే కాకుండా, వేసవిలో మంచి నీడను ఇవ్వడంతోపాటు పక్షులకు ఆశ్రయం కల్పిస్తున్నాయి. ఐతే ఈచిత్రం ప్రకృతి ప్రేమికులకు, ప్రయాణికులకు ఒక ఆహ్లాదకరమైన అనుభూతిని కలిగిస్తోంది.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్



తరిగొప్పుల, జూలై 5 ప్రభాతవార్త :

ముందస్తు అరెస్టులతో మండలంలోని బిఆర్ఎస్ నాయకుల్లో తీవ్రఅసంతృప్తి నిరసన వ్యక్తంచేశారు. కేటీఆర్ కన్నెపల్లిలో నిర్వహించనున్న బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి సభకు పాల్గొనేందుకు వెళ్తున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడడానికి శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు బిఆర్ ఎస్ నాయకులను ఆదివారం తెల్లవారుజామునే ముందస్తు అరెస్ట్‌చేశారు. కేటీఆర్ పర్యటనను అడ్డుకోవడానికి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఈ అరెస్టులకు పాల్పడుతోందని, శాంతి యుతంగా జరిగే సభకు వెళ్తున్న క్రమంలో అడ్డుకోవడం సరైందికాదని, ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాంగ్రెస్‌ప్రభుత్వం తొక్కిపడుతుందని మండల అధ్యక్షుడు పింగిలి జగన్మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. అరెస్ట్ అయినవారిలో మాజీ ఎంపిటిసి జూంలాల్, చెన్నూరి సంజీవులు, సిద్దిని మహిపాల్,

గ్రామశాఖ అధ్యక్షుడు అంకం రాజారాం,జిల్లా నాయకులు ఏడెల్లి శ్రీనివాస్‌రెడ్డి,బూస యాదయ్య తదితరులు ఉన్నారు.

పార్టీ కార్యకర్తలే నాబలం.. పార్టీ బలోపేతమే లక్ష్యం

- మండల అధ్యక్షుడు మసూద్

బచ్చన్నపేట, జూలై 5 ప్రభాతవార్త :

కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలే తనకు నిజమైన బలమని బచ్చన్నపేట మండలకాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ మాసూద్ అన్నారు. బచ్చన్నపేట మండలంలోని ప్రతీకార్యకర్తను కలుపుకొని పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. అందరి సమన్వయం, సహకారంతోనేపార్టీని మరింత ముందుకు తీసుకెళ్లడం తన లక్ష్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్‌పార్టీ కోసం నిబద్ధతతో, నిజాయితీగా పనిచేసే ప్రతికార్యకర్తకు పార్టీలో తగిన గుర్తింపు, ప్రతిఫలం తప్పకుండా లభిస్తుందన్నారు. కార్యకర్తలు ఓపికతో పార్టీ కోసం పనిచేయాలని, వారి శ్రమకు తగిన గౌరవం, అవకాశం తప్పకుండా వస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, భువనగిరి పార్లమెంట్ సభ్యుడు కిరణ్‌కుమార్ రెడ్డి, జనగామ జిల్లాకాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ధన్వంతి, జనగామ నియోజకవర్గ



కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆశీస్సులు, అండదండలతో కాంగ్రెస్ పార్టీలో మరింత నిబద్ధతతో కొనసాగుతూ పార్టీఅభివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తానని మండలకాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ మాసూద్ స్పష్టంచేశారు.

విజయ పాల డైరీ ఉత్తమ రైతు అవార్డు అందుకున్న కుమ్రం భీం జిల్లా రైతు

ఫోటోరైటప్ : అవార్డు అందుకుంటున్న కోట్నాక విజయ్ కుమార్

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జులై 5, ప్రభతవార్త :



తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ (విజయ డైరీ) ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లాలో ఘనంగా నిర్వహించిన విజయ పాల శీతలీకరణ కేంద్రం 60వ స్వర్ణోత్సవ వేడుకల్లో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన రైతు కోట్నాక విజయ్ కుమార్ రాష్ట్ర స్థాయి ఉత్తమ రైతు అవార్డు అందుకుని జిల్లా రైతాంగానికి గర్వకారణంగా నిలిచారు. విజయ డైరీకి అత్యధికంగా నాణ్యమైన పాలను సరఫరా చేస్తూ పాడి పరిశ్రమ అభివృద్ధికి విశేష సేవలు అందించినందుకు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, విజయ డైరీ చైర్మన్ కే. శంకరయ్య, పాల ఉత్పత్తిదారుల చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డితో పాటు సంస్థ డైరెక్టర్లు సంయుక్తంగా ప్రదానం చేశారు. అవార్డు స్వీకరించిన అనంతరం కోట్నాక విజయ్ కుమార్ మాట్లాడుతూ రైతు జీవితంలో ప్రతి విజయం కష్టానికి లభించే ప్రతిఫలమని అన్నారు. పాడి రైతులు తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు పశువులను కుటుంబ సభ్యుల్లా చూసుకుంటూ నాణ్యమైన పాలను ఉత్పత్తి చేసేందుకు నిరంతరం శ్రమిస్తారని పేర్కొన్నారు. ఆ శ్రమను గుర్తించి రాష్ట్ర స్థాయిలో సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ అవార్డును తన ఒక్కరికే కాకుండా పాడి పరిశ్రమను నమ్ముకుని జీవిస్తున్న ప్రతి రైతుకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. యువ రైతులు సంప్రదాయ వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపై కూడా దృష్టి సారించాలని, ఆధునిక పద్ధతులను అనుసరించడం ద్వారా మెరుగైన ఆదాయం పొందవచ్చని సూచించారు. రైతుల కృషిని గుర్తించి ప్రోత్సహిస్తున్న విజయ డైరీ యాజమాన్యానికి, తెలంగాణ ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు

రాష్ట్రంలో ప్రతి రంగాన్ని అభివృద్ధి చేస్తూ ప్రజా పాలన సాగిస్తున్నాం

ఉద్దేశపూర్వకంగా బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారు

రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు

భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద

మంచిర్యాల ప్రతినిధి, జూలై 5, ప్రభాతవార్త



రాష్ట్రంలోని ప్రతి రంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ప్రజా పాలన కొనసాగించడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. ఆదివారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల సంక్షేమంలో భాగంగా ప్రతి రంగంపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మండల కేంద్రంలో మురుగు కాలువ నిర్మాణ పనులను ప్రారంభించడం జరిగిందని, 143 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు అందించడం జరిగిందని తెలిపారు. అర్హులైన పెంకుటిల్లు ఉన్నవారికి, సొంత స్థలం కలిగిన వారికి ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింప చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులందరికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందని, రేషన్ కార్డులు జారీ చేసి చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందించేలా క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్నామని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గ పరిధిలో పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో 36 కోట్ల రూపాయలతో 56 కిలోమీటర్ల మేర రహదారులు, రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో 63 కోట్ల రూపాయల వ్యయంతో రహదారులు నిర్మించడం జరుగుతుందని, భీమారం మండల పరిధిలో 6 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అమృత్ 2.0 పథకం క్రింద ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా నిరంతరం త్రాగునీటి సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సుమారు 100 కోట్ల రూపాయల వ్యయంతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనంపై కొందరు ఉద్దేశపూర్వకంగా గొడవలు సృష్టించి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, సోషల్ మీడియాలో అవాస్తవాలను ప్రచారం చేస్తూ ప్రజలలో ఆందోళనలు కలిగిస్తున్నారని, ఈ విషయాన్ని ప్రభుత్వం పరిగణలోకి తీసుకుని కఠిన చర్యలు చేపడతామని తెలిపారు. చెన్నూర్ పట్టణంలో రహదారి విస్తరణలో వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని, 1 కోటి 60 లక్షల రూపాయల డి.ఎం.ఎఫ్.టి నిధులతో బైపాస్ రోడ్డు నిర్మించడం జరుగుతుందని, 1 కోటి 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న 20 షాపులలో పేద వ్యాపారస్తులకు ప్రాధాన్యత ఇచ్చి కేటాయించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 12 కోట్ల రూపాయల సి.ఎస్.ఆర్. నిధులతో చెన్నూర్ నియోజకవర్గంలో రహదారులు, మురుగు కాలువల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతో పాటు అన్ని గ్రామాలలో రహదారులు, మురుగు కాలువల వ్యవస్థ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సి.సి. మురుగు కాలువలలో మ్యాజిక్ సోక్ ఫీట్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, తద్వారా భూగర్భ జల శాతాన్ని పెంపొందించే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. డి ఎం ఎఫ్ టి, సి ఎస్ ఆర్ నిధులతో భీమారంలో అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మైనారిటీ సంక్షేమ వసతి గృహంలో మధ్యాహ్న భోజనం విషయంలో ఏర్పడిన గందరగోళంలో ఎలాంటి వాస్తవం లేదని, కొంతమంది ఉద్దేశపూర్వకంగా పిల్లలతో అబద్దాలు చెప్పించారని, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యారంగంలో మంచిర్యాల జిల్లా 3వ స్థానంలో ఉందని, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలు ఇతర ప్రభుత్వ సంబంధిత విద్యా సంస్థలలో ఈ సంవత్సరం నో అడ్మిషన్ బోర్డులు పెట్టడం జరిగిందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో 3 వేల మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలలో చేరారని తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధి ప ప్రత్యేక దృష్టి సారిస్తుందని, విద్యాసంస్థలలో సి.సి. కెమెరాల తో పర్యవేక్షించడం జరుగుతుందని, విద్యార్థులకు 200 శాతం కాస్మోటిక్, 40 శాతం డైట్ చార్జీలు పెంచి అందించడం జరుగుతుందని, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం భోజనశాలలు, అదనపు తరగతి గదులు నిర్మించడం జరుగుతుందని, ఆర్.ఓ. ప్లాంట్లు ఏర్పాటుచేసి శుద్ధమైన త్రాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై కేజీ వీల్ ట్రాక్టర్లు నడిపితే కఠిన చర్యలు

కాల్వ శ్రీరాంపూర్ ప్రభాతవార్త రోడ్లపై కేజీవిల్ తో ట్రాక్టర్లను నడిపితే కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎస్సై వెంకటేష్ హెచ్చరించారు రోడ్లపై కేజీవిల్ ట్రాక్టర్లను నడపడం వల్లరోడ్లుతీవ్రంగాధ్వంసమవుతున్నాయని, ఇటీవల నిబంధనలను ఉల్లం ఘించి రోడ్లను పాడుచేస్తూ పట్టుబడిన వ్యక్తులపై అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా స్థానిక తహశీల్దార్ కు నివేదించడం జరిగిందని ఆయన తెలిపారు.ఇటీవల పట్టుబడిన కేసుల మోట్లపల్లి గ్రామంలో ఉదయం పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, గ్రామ పంచాయతీ రోడ్డుపై తన కేజీ వీల్ ట్రాక్టర నడుపుతూ రోడ్డుకు నష్టం కలిగిస్తున్న పోగుల గణేష్అలాగే మీర్జాంపేట గ్రామానికి చెందిన ఆళ్ల తిరుపతి రెడ్డి కొమురయ్య . లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి, తదుపరి చర్యల కోసం తహశీల్దార్ కు అప్పగించామన్నారు కాబట్టి, గ్రామాల్లోని రైతులు ట్రాక్టర్ల యజమానులు ఎవరూ కూడా గ్రామ పంచాయతీ రోడ్లపై కేజీ వీల్ ట్రాక్టర్లను నడపరాదని, ఈ నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఆయన తెలిపారు

పోలీస్ పై దాడికి యత్నించి,విధులకు ఆటంక పరచిన వ్యక్తిపై కేసు నమోదు

వీణవంక, ప్రభాత వార్త:

వీణవంక మండలము మళ్ళా రెడ్డి పల్లి గ్రామానికి చెందిన మోరే దివాకర్ ఆదివారం మా గ్రామానికి కొత్త రోడ్డు వేయాలని , రోడ్డు కు అడ్డంగా లారీని నిలిపి ట్రాఫిక్ కి అంతరాయం కలిగించగా సమాచాస్తమందుకొన్న పోలీసులు అక్కడికి చేరుకొని చట్టపరమైన విధానాన్ని వివరించి,ట్రాఫిక్ క్లియర్ చేశారు.తిరిగి ఆవ్యక్తి 8 లారీ ల ను అడ్డుకొని ట్రాఫిక్కు అంతరాయం కలిగించందమితో ,పోలీస్ పలుమార్లు హెచ్చరించినప్పటికీ ,వినకపోవడం తో పాటు పోలీస్ సిబ్బందిని అడ్డుకొని ,తీసివేయడం విధులకు ఆటంకం కలిగించినందున ,అతనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

అనారోగ్య కారణంతో పురుగుల మందు త్రాగి వ్యక్తి మృతి

వీణవంక, ప్రభాత వార్త:



వీణవంక మండలము కోర్కల్ గ్రామానికి చెందిన పూదరి తిరుపతి (55)గౌడ్ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.మృతుడు గత కొంత కాలంగా అనారోగ్య సమ స్యలతో బాధపడుతూ మనస్థాపానికి గురై గత నాలుగు రోజుల క్రితం గడ్డి మంది త్రాగగా, గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జమ్మికుంట లోని లక్ష్మీ నరసింహా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు భార్య పూదరి లక్ష్మీ తెలిపారు.మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

రేకుల షెడ్డు కూల్చివేత

ముగ్గురిపై కేసు నమోదు

బీర్‌పూర్ ప్రభాత వార్త



జగిత్యాల జిల్లా బీర్పూర్ మండల పరిధిలోని నర్సింహులపల్లి గ్రామంలో రేకుల షెడ్డు కూల్చివేతకు సంబంధించి ముగ్గురిపై కేసు నమోదైనట్లు బీర్పూర్ సబ్ ఇన్స్పెక్టర్ ఎస్. రాజు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నర్సింహులపల్లి గ్రామానికి చెందిన భోగ సత్తన్న, తండ్రి కిష్టయ్య అనే వ్యక్తికి చెందిన రేకుల షెడ్డును అదే గ్రామానికి చెందిన ధ్యావనపల్లి గంగాధర్ మరియు అతని ఇద్దరు కొడుకులు ధ్యావనపల్లి గణేష్, రాజేందర్ కలిసి , 05 వ తేదీ నాడు తమ ట్రాక్టర్ డోజర్ సహాయంతో అక్రమంగా కూలగొట్టారనీ బాధితుడు భోగ సత్తన్న ఇచ్చిన లిఖితపూర్వక దరఖాస్తు (ఫిర్యాదు) మేరకు నిందితులైన ధ్యావనపల్లి గంగాధర్, గణేష్, రాజేందర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్.ఐ ఎస్. రాజు ప్రకటన లో పేర్కొన్నారు.

పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాలు

జగిత్యాల,టౌన్ ప్రభాతవార్త:

అంతర్జాతీయ జునోసిస్ డే జూలై 6 పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలోని పెంపుడు కుక్కల యజమానులకు పశుసంవర్ధక శాఖ మంచి అవకాశం కల్పించింది.జగిత్యాల ప్రధాన పశువైద్యశాలలో సోమవారం ఉదయం ఎనిమిది గంటల నుండి పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేయనున్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.జునోసిస్ వ్యాధుల పట్ల అవగాహన పెంచడం,రేబిస్ మహమ్మారి నుండి పెంపుడు జంతువులను రక్షించడమే ధ్యేయంగా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.జగిత్యాల పట్టణ పరిధిలోని పెంపుడు కుక్కల యజమానులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సకాలంలో తమ మూగజీవాలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేయించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జగిత్యాల పట్టణ ప్రధాన పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మదన్ మోహన్ ఒక ప్రకటనలో కోరారు.

వారం రోజుల్లో అభివృద్ధి పనులు ప్రారంభించాలి

బిజెపి పట్టణ అధ్యక్షుడు ధోనికేల నవీన్

మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త : మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 26 వార్డుల్లో మంజూరైన అభివృద్ధి పనులను వారం రోజుల్లో ప్రారంభించకపోతే భారీ స్థాయిలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని బీజేపీ పట్టణ అధ్యక్షుడు ధోనికెల నవీన్ హెచ్చరించారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ధర్మపురి స్వరూప వేణుగోపాల్, వైస్ ఫ్లోర్ లీడర్ బొడ్ల ఆనంద్‌తో కలిసి ఆయన మాట్లాడారు. అభివృద్ధి పనులు రాజకీయాలకు అతీతంగా జరగాలని, అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు పనులకు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు పెంచడం వల్ల వారు విధులు నిర్వహించడానికి భయపడుతున్నారని విమర్శించారు. వర్షాకాలంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వైకుంఠధామాల అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిధులు మంజూరై,



కాంట్రాక్టర్లతో ఒప్పందాలు పూర్తయినా పనులు ప్రారంభం కాకపోవడం బాధాకరమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని, వారం రోజుల్లో పనులు ప్రారంభించకపోతే పెద్ద ఎత్తున మున్సిపల్ ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు మిట్టపల్లి కృష్ణమూర్తి, బత్తుల జగదీష్, నూనె క్రాంతి, తల్లోజి భాస్కర్, లోలపు అనిల్, పాసుకంటి శ్రీనివాస్, భాస్కరాచారి, భోగ దత్తు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు మొక్కులు భక్తిశ్రద్ధలతో బోనాలు

ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త :



ఇబ్రహీం పట్నం మండలం లోని వేములకుర్తి, ఎర్రండి గ్రామాల్లో ఆదివారం గ్రామ అభివృద్ధి కమిటీలు, కుల సంఘాల ఆధ్వర్యంలో పోచమ్మ, నల్ల పోచమ్మ, తంగళ్ల పోచమ్మ, ముత్యాల పోచమ్మ, ఐదు చేతుల పోచమ్మ గ్రామ దేవతలకు భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గోల్లెం ఊరేగింపు నిర్వహించారు. దప్పు చప్పుళ్ల మధ్య అమ్మవారి చీరలు, పూజా సామగ్రి, బోనాలతో మహిళలు భక్తిపూర్వకంగా ఊరేగింపులో పాల్గొన్నారు. పలుచోట్ల పోతరాజుల విన్యాసాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ



సందర్భంగా గ్రామాల్లో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలు బాగా పండాలని, గ్రామానికి ఎలాంటి అపాయాలు కలగకుండా అమ్మవారు కాపాడాలని గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఎడిపెల్లి మురళి, నల్లపు రమేష్, సర్పంచ్ తరి రామనుజం, కల్లెడ గంగాధర్, ఉపసర్పంచ్ బర్మ మల్లయ్య, అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు మెగిలి దేవదాస్, కోశాధికారి అన్నరపు రాజిరెడ్డి, రైటర్ పెంట మహేష్, కమిటీ సభ్యులు అంకతి రాజలింగం, కుమ్మరిపెల్లి మల్లేశం, పల్లి పెద్దలు, జిల్లా ఆనందం, అల్లెపు మహేష్, మాలేపు లక్ష్మణ్, సిలివేరి మహేష్, అక్కపెల్లి గంగాధర్, కనపర్తి నరేష్, పట్నం నర్సయ్య, గుడ్ల శ్రావణ్, మగ్గిడి గంగాధర్, పోతరాజులు జంగ సంపత్, జంగ ముఖేష్, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంబేద్కర్ స్మరణతో పాటుగా ఆచరణలో కూడా ముందుండాలి

బడుగు బలహీన వర్గాల ప్రజలు ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపు..

రాధ వెంకటేశ్వర్లు, కుంగ్ ఫూ, బ్లాక్ బెల్ట్, ఉగాది పురస్కార గ్రహీత ఈశ్వరమ్మ సాహిత్య పీఠం

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్, డిక్కీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే అంబేద్కర్ స్మరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి రాధ వెంకటేశ్వర్లు కుంగ్ ఫూ, బ్లాక్ బెల్ట్, ఉగాది పురస్కార గ్రహీత ఈశ్వరమ్మ సాహిత్య పీఠం పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాధ వెంకటేశ్వర్లు మాట్లాడుతూదేశంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ జీవితాంతం పోరాడారని తెలిపారు. భారత రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కల్పించేందుకు ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు.అంబేద్కర్ త్యాగాలు, రాజ్యాంగ రూపాకల్పనలో అంబేద్కర్ పాత్ర చారిత్రాత్మకమని పేర్కొన్నారు. సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందాలని, బహుజనులు రాజ్యాంగం పట్ల అవగాహన పెంపొందించుకుంటూ సమిష్టిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. యువత అంబేద్కర్ ఆలోచనలను అధ్యయనం చేసి సమాజాభివృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు.డిక్కీ జిల్లా కోఆర్డినేటర్ నల్ల శ్యామ్ మాట్లాడుతూ సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం వంటి విలువలను దేశ ప్రజలకు అందించిన మహనీయుడు



అంబేద్కర్ అని అన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. అంబేద్కర్ భావజాలాన్ని ప్రజల్లో విస్తృతంగా చాటేందుకు ప్రతి ఆదివారం ఈ స్మరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మరియు సీనియర్ సిటిజెన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, రిటైర్డ్ ఉపాధ్యాయులు సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి కంటే అంజయ్య, దళిత క్రిస్టియన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ముద్దమల్ల ఆనంద్ ప్రవీణ్ కుమార్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు చిత్తారి ప్రభాకర్, జిల్లా దళిత సంఘాల సీనియర్ నాయకులు దుమాల గంగాధర్, రుద్ర మనోహర్, బొల్లం ప్రభాకర్, డిజే లక్ష్మీ నారాయణ, దాసండ్ల కమలాకర్, సంకె మహేష్, లక్ష్మణ్,చిర్ర రవి, లక్కం సురేష్, నల్ల సురేష్, దేవి అంజి, తదితర అంబేద్కర్ వాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అనారోగ్యంతో.. వివాహిత ఆత్మహత్య

మానకొండూర్, ప్రభాతవార్త:

మండలంలోని కొండపల్కల గ్రామానికి చెందిన దావీల భాగ్యలక్ష్మి(45) అనే వివాహిత అనారోగ్యంతో బాధపడుతూ, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు ఆదివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కొండపల్కల గ్రామానికి చెందిన దావీల్ల శ్రీనివాస్ భార్య భాగ్యలక్ష్మి ఐదు సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధ పడుతూ ఎన్ని ఆస్పత్రులు తిరిగిన రోగం తగ్గకపోవడంతో మానసికంగా బాధపడుతుండేది. దీంతో భాగ్యలక్ష్మి కి జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఊరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. మృతురాలి భర్త శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు మానకొండూర్ సీఐ శ్రీలత తెలిపారు.

మెట్‌పల్లి వార్త

స్టెయిన్ లెస్ స్టీల్ పాడే అందజేత

మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త:



గత నెల క్రితం మరణించిన భూరం వెంకటేష్ జ్ఞాపకార్థం మరణించిన గ్రామ ప్రజల సౌకర్యార్థం స్టెయిన్ లెస్ స్టీల్ మృతదేహ పాడెను 11 వ వార్డు మాల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని అనుబంధ వార్డు వెంకట్రపేట్ కి అప్పగించారు.చివరి ఖననం కోసం మృతదేహాన్ని మోసుకెళ్లేందుకు స్టీల్ పాడెను చనిపోయిన భూరం వెంకటేష్ జ్ఞాపకార్థం అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రెబ్బాస్ మహేష్ యాదవ్ తో పాటు కోమిరెడ్డి మోహన్ రెడ్డి, బైన శ్రీనివాస్, మోర్తాద్ మురళి, భూరం సురేష్, భూరం సంజీవ్,రాజు,రాజేష్,రామ చందర్,రవి,తిరుపతి, రాజ్ రామ్, కాయిత మహేష్ నరేందర్, తిరుపతి,ప్రసాద్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

7, 8వ వార్డుల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలన

మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త :



మెట్‌పల్లి పట్టణంలోని 7వ, 8వ వార్డుల్లో పారిశుద్ధ్య పనులను ఆదివారం మున్సిపల్ కమిషనర్ డి శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా 7వ వార్డులో మురికి కాలువలను ఆక్రమించి స్లాబులు వేయడం వల్ల మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోందని గుర్తించారు. కాలువల శుభ్రత కోసం పారిశుద్ధ్య సిబ్బంది స్లాబుల కిందకు వెళ్లి పని చేయాల్సి వస్తోందని, అందువల్ల అవసరమైతే ఆక్రమణలకు సంబంధించిన స్లాబులను తొలగిస్తామని కమిషనర్ తెలిపారు. మురికి కాలువలు, నాలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారిపై మున్సిపల్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం 3వ వార్డులో వర్షపు నీరు రోడ్డుపై నిలిచిన ప్రాంతాన్ని పరిశీలించి నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. 8వ వార్డులో జేసీబీ సహాయంతో మురికి కాలువల శుభ్రపరిచే పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నునుగొండ నరేష్, బత్తుల నరేష్, నాయకుడు ధర్మపురి వేణుగోపాల్, సానిటరీ ఇన్స్పెక్టర్ రాజ్‌కుమార్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యాపారంలో రాణించాలి

చిట్యాల, జూలై 5, ప్రభాతవార్త

నేటి యువత అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఆదివారం కామిశెట్టి కళ్యాణ్, శ్రీనివాస్ ల నూతన ట్రెండీ టచ్ మెన్స్ వేర్ ని ప్రారంభించారు. వ్యాపారంలో రాణించాలని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పర్సన్ పందిరి గీతా రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జడల చిన్న మల్లయ్య యాదవ్, కో ఆప్షన్ సభ్యులు బెల్లి సత్తయ్య, ఇమ్రాన్ తదితరులు ఉన్నారు.

శుభోదయ పాఠశాలలో డాక్టర్స్ డే వేడుకలు

తంగళ్ళపల్లి,ప్రభాతవార్త..

తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శుభోదయ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో డాక్టర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కరస్పాండెంట్ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూలైలో డాక్టర్స్ డే వేడుకలను జరుపుకోవడం జరుగుతుందన్నారు.మానవ మనుగడలో వైద్యులు దేవునితో సమానమని అన్నారు.బయటపదార్థాలు తినవద్దని,సీజనల్ పండ్లను తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. సేవ్ డాక్టర్స్ సేవ్ పేషెంట్ అని నినాదించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మ శ్రీ,సరిత,



మోనిక,స్రవంతి,కీర్తన,శిరీష,పి ఈ టి అజయ్, విద్యార్థులు,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు..

బురద రోడ్డుగా మారిన బర్మెకల కట్ట

రైతుల రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు

పట్టించుకోని నాయకులు, ప్రభుత్వాలు

ముస్తాబాద్ ప్రభాత వార్త:



గూడెం గ్రామశివారులోని బోప్ప చెరువు కట్ట కింద నుండి బర్మెకల కట్టకి వెళ్లే రోడ్డు వర్షాల కారణంగా ఎప్పుడు బురదగా మారుతుంది.వర్షాకాలం వచ్చేసరికి రైతుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వందలాదిమంది రైతులు తమ పంట పొలాలకు వెళ్లే ఈ రోడ్డు ఎప్పుడు బురద కుంటలా మారుతుంది. గతంలో బిఆర్ఎస్ పరి పాలనలో ్నడబర్ రోడ్డును మంజూరు చేశారు. అప్పుడు బిఆర్ఎస్ నాయకులు మంజూరు చేసిన రోడ్డును వేరే వైపు పాయించుకున్నారు. ఇప్పుడు అధికారంలో వున్న నాయకులు, చర్యలు తీసుకొని రోడ్డును మంజూరు చేస్తే వందలా మంది రైతుల సమస్యను తీర్చిన వారవుతారని అక్కడి రైతులు వాపోతున్నారు.

చందపల్లి మున్నూరు కాపు సంఘం అధ్యక్షులుగా గంగుల రాకేష్ ఎన్ని క

పెద్దపల్లి, ప్రభాతవార్త:



చందపల్లి గ్రామ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులుగా గంగుల రాకేష్ ఎన్నికయ్యారు. సంఘ సభ్యులు, పెద్దల సమక్షంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గంగుల రాకేష్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన సంఘ సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధి, సభ్యుల సంక్షేమం, యువత ప్రోత్సాహం, సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని అన్నారు. సంఘ పెద్దలు, సభ్యులు గంగుల రాకేష్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నాయకత్వంలో చందపల్లి మున్నూరు కాపు సంఘం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. “ఐక్యతే మన బలం... అభివృద్ధే మన లక్ష్యం“ అనే నినాదంతో సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని సభ్యులు పిలుపునిచ్చారు.

కన్నెపల్లి పంప్ హౌస్ కు తరలి వెళ్లిన బిఆర్ఎస్ నాయకులు

ముత్తారం, ప్రభాతవార్త:

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కన్నెపల్లి పంప్ హౌస్ పర్యటన సందర్భంగా మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డితో కలిసి ముత్తారం మండలానికి చెందిన బి ఆర్ ఎస్ నాయకులు తరలి వెళ్లారు. తరలి వెళ్లిన వారిలో మాజీ ఎంపీపీ అత్తే చంద్రమోళి, ముత్తారం సర్పంచ్ సుధాటి రవీందర్రావు, మాజీ ఎంపీపీ జక్కుల ముత్తయ్య, మాజీ సింగల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నాంపాని సమ్మయ్య, మాజీ డైరెక్టర్ కూరాకుల ఓదేలు తదితరులున్నారు.

ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి



గంభీరావుపేట, ప్రభాతవార్త:

ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కానపురం లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఆదివారం గంభీరావుపేట మండల కేంద్రంలో ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ ను ఆవిష్కరించారు. పద్మ శ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం రోజున ఎమ్మార్పీఎస్ 32 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలతో పాటు మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు ప్రతి గ్రామంలో వైభవంగా నిర్వహించాలని కోరారు. మందకృష్ణ మాదిగ చేసిన ఉద్యమాల కు సహకరించిన వివిధ కుల సంఘాల పెద్దలను నాయకులను, ప్రజా పతినిధులను వికలాంగులను ఆహ్వానించి అందరికి సమక్షంలో జెండా ఆవిష్కరించలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షులు బరుకుటం తిరుపతి, మాజీ ప్రధానకార్యదర్శి శనిగరపు నరేష్ వర్మ, మాజీ ఉపాధ్యక్షులు ఇరిగి సందీప్, శ్రీగాధ గ్రామశాఖ అధ్యక్షులు కత్తుల పెద్ద బాబు, దమ్మన్నపేట గ్రామశాఖ అధ్యక్షులు గుండెల్లి బాలరాజు, నాగంపేట్ గ్రామశాఖ అధ్యక్షులు పంగా బాలకృష్ణ, నాయకులు ఇరిగి పర్శరాములు,శనిగరపు శ్రీనివాస్, శనిగరపు చంద్రం, ఇరిగి బాబు, ఇరిగి దేవరాజు లతోపాటు తదితరులు పాల్గొన్నారు

గర్రెపల్లిలో ఘనంగా సీనియర్ వాలీబాల్ టోర్నీ

..సుల్తానాబాద్, ప్రభాతవార్త:



మండలంలోని గర్రెపల్లి జిల్లా ఉన్నత పాఠశాల ఆవరణలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా సీనియర్ వాలీబాల్ టోర్నమెంట్ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. నిర్వాహకులు కన్నా రమేష్, కస్తూరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పోటీలను ప్రారంభించారు. టోర్నీ నిర్వహణకు అసంపల్లి శ్రీనివాస్, నరసయ్యపల్లి సర్పంచ్ తిరుమల్‌రావు, పడాల అజయ్ గౌడ్, కస్తూరి లక్ష్మారెడ్డి తదితరులు ఆర్థిక సహకారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్స హించడం ద్వారా యువతలో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ పెంపొందుతాయని పేర్కొన్నారు. ఇలాంటి పోటీలు ప్రతిభావంతులైన క్రీడాకారులకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు కల్పిస్తాయని అన్నారు. అనంతరం గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు, క్రీడాభిమానులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సిరిసిల్ల వార్త

అణిచివేతను పాట ద్వారా ప్రశ్నించిన నాగన్న.

అంతర్గాం, ప్రభాత వార్త:



సమాజంలోని అణిచివేతను, అసమానతలను కామ్రేడ్ అరుణోదయ నాగన్న తన పాట ద్వారా ప్రశ్నించాడని సిపిఐ ఎం ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కోడిపుంజుల రాజన్న అన్నారు. ఆదివారం అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట గ్రామంలోని భగత్ సింగ్ భవన్ లో అరుణోదయ కళాకారుడు పరకాల నాగన్న చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కే. రాజన్న మాట్లాడుతూ విప్లవ ఉద్యమం లో అమ రులైన ఎందరో నాయకుల స్మృతులను స్మరిస్తూ, సారా వ్యతిరేక ఉద్యమం, దున్నేవానికే భూమి దక్కాలని, యువత, కార్మిక సమస్యలపై, అనేక సినిమాలకు పాటలు రాసి పాడారని పేర్కొన్నారు. నాగన్న పాటలను వ్యతిరేకించిన ప్రభుత్వాలు ఎన్ని రకాలుగా ఇబ్బందులకు గురిచేసిన తను మాత్రం పేద ప్రజల గొంతుకై గర్జించాడని కొనియాడారు. నూతన ప్రజాస్వామిక, సాంస్కృతిక విప్లవం కోసం పోరాడడమే నాగన్న కు మనం ఇచ్చే నిజమైన నివాళులు అని పేర్కొన్నారు. కార్యక్రమం లో న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు మేరుగు చంద్రయ్య, కోడిపుంజుల జ్యోతి, కొల్లూరి మల్లేష్, కోడిపుంజుల భూమేష్, పైడిపెల్లి రమేష్, సతీష్, రాజయ్య, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

ముత్తారం పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సిపి

ముత్తారం, ప్రభాతవార్త:

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా సరే కఠిన చర్యలు ఉంటాయని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు. ఆదివారం ముత్తారం పోలీస్ స్టేషన్లో సిపి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పరిపాలనా విధానాలలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని, ప్రతి కేసు రికార్డును పారదర్శకంగా ఉంచాలని స్పష్టం చేశారు. సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తించే మూఢనమ్మకాలపై గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ వస్తున్న సైబర్ ఫ్రాడ్స్, ఆన్‌లైన్ మోసాల గురించి ప్రజలకు ముందస్తు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో ఎంతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారి భద్రతను పటిష్టం చేయడంలో భాగంగా వాహనాల తనిఖీలను మరింత కఠినతరం చేయాలని, వాహనదారులు ఖచ్చితంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెల్లుబాటు అయ్యే ఒరిజినల్ పత్రాలు కలిగి ఉండేలా విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఈ పోలీస్ స్టేషన్ తనిఖీ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, మంథని సీఐ స్వామి, ముత్తారం ఎస్ఐ రవికుమార్ తో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



నీరున్నా బీడు భూములే..

మోటార్లకు విద్యుత్తు కనెక్షన్ల ఇవ్వరు ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న రైతాంగం

కాలయాపన చేస్తున్న అధికారులపై రైతుల మండిపాటు!

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:




జగిత్యాల మండలం రూరల్ పరిధిలోని పలు గ్రామాల్లో వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న అన్నదాతల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. బావుల్లో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ, అధికారుల నిరక్ష్యం వల్ల మోటార్ కనెక్షన్లు రాక పంట భూములు బీడుగా మారుతున్నాయి. తమకున్న కొద్దిపాటి భూమిని నమ్ముకుని, అప్పులు చేసి బావులు తవ్వుకున్న చిన్న,సన్నకారు రైతులు ఏడాది క్రితమే అన్ని రకాల పత్రాలతో, నిబంధనల ప్రకారం విద్యుత్ కనెక్షన్లు,సబ్సిడీ మోటార్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. చాలా గ్రామాల్లో రైతులు డిడిలు చెల్లించి నెలలు గడుస్తున్నా,కనీసం పోల్స్ వేయడానికి లేదా ట్రాన్స్ ఫార్మర్లు అమర్చడానికి కూడా సిబ్బంది రావడం లేదు. తమ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రతిసారీ మెటీరియల్ కొరత, ఫైల్ ప్రాసెస్, పై అధికారుల ఆదేశాలు అంటూ సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారే తప్ప, సమస్యను పరిష్కరించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా ఫలితం దక్కడం లేదు. ఈ ఆలస్యం కారణంగా గతేడాది వానాకాలం, యాసంగి పంటలను కోల్పోయిన రైతాంగం, ప్రస్తుత సీజన్‌లోనూ సాగు పనులు ప్రారంభించలేక ఆర్థికంగా భారీ నష్టాలను చవిచూస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తుల నుండి అద్దెకు మోటార్లు తెచ్చుకుని, ఆ కిరాయి ఖర్చులను భరించలేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. వర్షాలు సమృద్ధిగా పడుతున్న తరుణంలో, చేతిలో మోటార్ కనెక్షన్ లేకపోవడంతో సాగు సమయం దాటిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మళ్లీ పొలాలు వేసే సమయం వస్తున్నందున అధికారులు ఈ సాకుతో కాలయాపన చేస్తారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రత్యేక శ్రద్ధ వహించి,జగిత్యాల రూరల్ గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న బావి మోటార్ల దరఖాస్తులను తక్షణమే పరిశీలించాలని కోరుతున్నారు. యుద్ధప్రాతిపదికన మోటార్ల మంజూరుకు, విద్యుత్ కనెక్షన్ల విడుదలకు ఆదేశాలు జారీ చేయాలని, లేనిపక్షంలో తాము ఆందోళన బాట పట్టక తప్పదని మండల రైతాంగం పేర్కొంటున్నారు.

జగిత్యాల పట్టణ మేదరి సంఘం నూతన అధ్యక్షుడిగా చింత రమేష్

జగిత్యాల టౌన్,ప్రభాత వార్త

జగిత్యాల పట్టణ మేదరి సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం స్థానిక హనుమాన్‌వాడలో సంఘ భవనంలో నిర్వహించబడ్డాయి. ఎన్నికల ప్రక్రియను కనికరపు శ్రీనివాస్, చింత నరేష్, పిల్లి శ్రీనివాస్, చింత సంతోష్, చింత రాజమల్లు, మదిరే కృష్ణ చైతన్యలు ఎన్నికల అధికారులుగా పర్యవేక్షించారు. అధ్యక్ష పదవికి ముగ్గురు అభ్యర్థులు పోటీ చేయగా, చింత రమేష్‌కు అత్యధికంగా 128 ఓట్లు లభించాయి. చింత గంగారాంకు 79 ఓట్లు, చింత గంగాధర్‌కు 44 ఓట్లు రావడంతో సమీప ప్రత్యర్థిపై 49 ఓట్ల మెజారిటీతో చింత రమేష్ జగిత్యాల పట్టణ మేదరి సంఘం అధ్యక్షుడిగా విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శి పదవికి జరిగిన ఎన్నికల్లో చింత రాజేశం, కనికరం భీమయ్య పోటీ చేయగా, కనికరం భీమయ్య 40 ఓట్ల మెజారిటీతో విజయం సాధించి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంలో కోశాధికారిగా చింత భీమయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రచార కార్యదర్శిగా బొమ్మిడి దశరథం, ఉపాధ్యక్షులుగా వేముల వంశీకృష్ణ, పిల్లి కిషన్ కుమార్, చింత సురేష్, వేముల సునీల్, పోతు కృష్ణ, మీడియా అధ్యక్షుడిగా చింత నరేష్, సహాయ కార్యదర్శులుగా చింత రాజు, వేముల రాజేష్, పోతు మహేష్, పట్టణ ఉద్యోగ సంఘం అధ్యక్షుడిగా గైని లచ్చన్న ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఊలే రాజన్న, సంగ గంగాధర్, పిల్లి



బాలకృష్ణ, నాగురి హరీష్ తదితరులు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ, మేదరి సంఘం అభివృద్ధి, సభ్యుల సంక్షేమం, యువతకు ప్రోత్సాహం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన సభ్యునికి అందేలా కృషి చేస్తామని తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి అందరి సహకారంతో ముందుకు సాగుతామని ఆయన పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, సంఘ ఐక్యతకు ప్రాధాన్యతనిస్తూ సభ్యుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని అన్నారు. ఈ ఎన్నికల కార్యక్రమంలో ఎన్నికల పర్యవేక్షణ అధికారులు చింత రాజనర్సు, చింత భీమయ్య, జిల్లా అధ్యక్షులు ఇందూరి గంగాధర్, గైని శ్రవణ్, గైని లచ్చన్న, పిల్లి బాలకృష్ణ, వేముల నర్సింగం, వేముల రాజేశం తదితరులు పాల్గొని నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు.

జులై 7న ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేయాలి

ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారం

జగిత్యాల,టౌన్ ప్రభాతవార్త:

ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం మాదిగల మహాత్ముడు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా ప్రతి గ్రామంలో జులై 7న మాదిగల ఆత్మగౌరవ ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేయాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు దుమాల గంగారం మాదిగ పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లాలోని మండల కేంద్రాలతో పాటు ప్రతి గ్రామంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా దుమాల గంగారం మాదిగ మాట్లాడుతూ, 32 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, లక్ష్యం చేరేంతవరకు పోరాడి మాదిగ జాతికి హక్కులను ఆత్మగౌరవాన్ని తీసుకువచ్చిన పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎట్టకేలకు వర్గీకరణ సాధించుకున్నామని గుర్తుచేశారు. దీనివల్ల మాదిగ, మాదిగ ఉపకులాల పిల్లలకు విద్య, ఉద్యోగ రంగాల్లో సముచిత ఫలాలు అందుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. కాబట్టి, ఈ తరుణంలో జరిగే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి గ్రామంలో పండగ వాతావరణంలో నిర్వహించాలని కార్యకర్తలకు, నాయకులకు



పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో జరిగే ముఖ్య కార్యక్రమానికి మధ్యాహ్నం 12 గంటల లోపు జిల్లాలోని మండల అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ సీనియర్ నాయకులు ప్రతి మాదిగ బిడ్డ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టుపెల్లి లక్ష్మణ్ మాదిగ, జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీష్ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు బోనగిరి కిషన్ మాదిగ, జిల్లా కార్యదర్శి సంగేపు ముత్తు మాదిగ, ధర్మపురి మండల అధ్యక్షులు చెందోలి శ్రీనివాస్ మాదిగ, జగిత్యాల అర్బన్ మండల అధ్యక్షులు బాపురపు గంగారం మాదిగ, కొడిమ్యాల మండల ప్రధాన కార్యదర్శి బెక్కం శ్రీనివాస్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

మాజీమంత్రి రాజేశం గౌడ్‌ను పలమర్శించిన పలువురు ప్రముఖులు

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త: హైదరాబాద్‌లోని మాజీ సీనియర్ మంత్రి, తెలంగాణ రాష్ట్ర తొలి ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ గోడిశెల రాజేశం గౌడ్ నివాసంలో జగిత్యాల జిల్లా లక్ష్మిపూర్ గ్రామ వాస్తవ్యులు, ఆర్కిటెక్ట్ ఇంజనీర్ గర్వాండుల శివ గౌడ్, ప్రముఖ బిల్డర్ పెద్దిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు. ఇటీవల మోకాలి మార్పిడి శస్త్రచికిత్స చేయించుకుని కోలుకుంటున్న రాజేశం గౌడ్‌ను కలిసి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఈ సందర్భంగావారు ఆకాంక్షించారు. తమను కలిసి ఆప్యాయంగా పరామర్శించినందుకు గాను శివ గౌడ్, శ్రీనాథ్ రెడ్డిలకు రాజేశం గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

జగిత్యాల వార్త

వివాహ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి సీనియర్ నాయకులు

జగిత్యాల టౌన్,ప్రభాతవార్త



పెద్దపల్లి మాజీ శాసన సభ్యులు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు గుజ్జులా రామకృష్ణ రెడ్డి పుత్రిక వివాహానికి బి జె పి నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ఏ సి స్ రాజు, సిపెల్లి రవీందర్, నారేందుల శ్రీనివాస్, వేముల పొచమల్లు, చీటీ శేఖర్ రావు , అశోక్, రవి తదిరులు పాల్గొన్నారు

కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:



జగిత్యాల మండలం రూరల్ జాబితాపూర్ గ్రామంలో ఆదివారం శాలివాహన కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో నల్ల పోచమ్మ బోనాల వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు నిష్టతో బోనాలను తయారు చేసి, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. ఈ ఉత్సవాల్లో శాలివాహన కుమ్మరి సంఘం అధ్యక్షుడు మద్దికుంట హరీష్, సంఘం ఉపాధ్యక్షుడు మొగిలిపల్లి చంద్రయ్య, గ్రామ సర్పంచ్ పొంశెట్టి మహేష్, ఉపసర్పంచ్ మర్చటి లక్ష్మణ్, వార్డు సభ్యుడు శెట్టి రవీందర్ తదితరులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన యువతీ,యువకులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకలు ప్రశాంతంగా, ఘనంగా ముగిసేలా కుమ్మరి సంఘం ప్రతినిధులు, గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ప్లాస్టిక్ నిర్మూలన కొరకు ఉద్యమం

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

ప్లాస్టిక్ నిర్మూలన కొరకు ఉద్యమం చేపట్టిన నాగిరెడ్డి మధుసూదన్ రెడ్డి కి న్యాయవాద వాకర్స్ మద్దతు ప్రకటించారు. ప్లాస్టిక్ వల్ల రకరకాల జబ్బులు , క్యాన్సర్ లు వస్తున్నాయని, వీటి వల్ల చాలా అనర్థాలు జరుగుతున్నాయని, ప్లాస్టిక్ వాడవద్దని ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా న్యాయవాదులు ఏ.రామచంద్రం, కే. వెంకటేశ్వర్ రావు, తుమ్మనపల్లి రమేష్, బెజ్జారపు ప్రవీణ్, గోపి కిషన్, అందె మారుతి, అమరదీప్, కె. గంగారాజం, కరబూజ నర్సయ్య, పి. వెంకటేశ్వర రావు, సంపత్, శ్రీకాంత్, కె రాజేందర్ తదితరులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

నెంబర్ ప్లేట్ లేని వాహనాలు దొరికితే సీజ్

ఎస్సై బి జగదీశ్వర్

చిగురుమామిడి, ప్రభాత వార్త :

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చెయ్యాలని, మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, తల్లిదండ్రులు మైనర్లు కు వాహనాలు ఇవ్వడం వలన ప్రమాదాల్లో విలువైన ప్రాణాలు కోల్పోవడమే కాకుండా తీవ్రమైన గాయాల పాలు అవుతున్నారని, తల్లిదండ్రులు మైనర్లకు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి వాహనాలను ఇవ్వద్దని ఎస్సై బి జగదీశ్వర్ మండల ప్రజలను కోరారు. ఎస్సై మాట్లాడుతూ మైనర్లు కుడ్రైవింగ్ లైసెన్సు లేదని తెలిసి కూడా వాహనం ఇచ్చినట్లయితే వాహనం ఇచ్చిన ఓనర్ పైన కేసు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందని, నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడపడం, తప్పుడు నంబర్లు ఏర్పాటు చేయడం, ప్రజలకు ఇబ్బంది కలిగించే శబ్ద కాలుష్యాన్ని సృష్టించే విధంగా ద్విచక్ర వాహనాలు సైలెన్సర్లను కలిగి ఉన్న వాహనదారులపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. నిబంధనలకు లోబడి లేకపోతే, చీటింగ్ కేసు నమోదు చేస్తామని,కావున మండల ప్రజలు దీనిని దృష్టిలో పెట్టుకొని మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, వాహనాలు ఇచ్చి రోడ్డు ప్రమాదాలకు కారకులు కారాదని, మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్షతోపాటు జరిమానాలు తప్పవని ఎస్సై జగదీశ్వర్ హెచ్చరించారు.



రైతు భరోసా నిధులు విడుదల పట్ల హర్షం..

కాంగ్రెస్ నేతల చిత్రపటాలకు క్షీరాభిషేకం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి ...

మానకొండూరు, ప్రభాతవార్త:

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల పట్ల మానకొండూరు నియోజకవర్గం కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ధనసరి సీతక్క, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటాలకు క్షీ రాభిషేకం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మానకొండూరు నియోజక వర్గానికి రూ.58 కోట్ల రైతు భరోసా నిధులు అన్నదాతల ఖాతాలో ప్రభుత్వం జమ చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జూలై 4 నాటికి



67.44 లక్షల మంది రైతులకు1.18 కోట్ల ఎకరాలకు 7.135.77 కోట్ల రైతు భరోసా నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా నిధులను విడుదల చేయడం పట్ల రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మానకొండూరు మండలంలో సుమారు 30 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి రు.14 కోట్ల రూపాయలు విడుదలయ్యాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హైబ్రిడ్ యాన్యుటి మోడల్(హ్యామ్) విధానంలో రోడ్ల నిర్మాణానికి రూ.11.540 కోట్ల నిధులు మంజూరు కాగా, మానకొండూరు నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల్లో 75.67 కిలోమీటర్ల కు 19 రోడ్ల నిర్మాణ పనులకు రూ.58.29 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలనలో నియోజకవర్గం లో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతిక్షణం పాటుపడుతూ, నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే కవ్వంపల్లికి మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన శ్రీనివాస్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రవీంద్ర చారి, మార్కెట్ చైర్మన్ మర్రి ఓదెలు, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు కిషన్ రావు, సర్పంచ్ బుర్ర శేఖర్, కొండ్ర సురేష్, డైరెక్టర్ బుర్ర శ్రీకాంత్, కనకం కుమార్, మండల నాయకులు పాల్గొన్నారు.

నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన పొరండ్ల సింగిల్ విండో చైర్మన్ గోపు మల్లారెడ్డి

తిమ్మాపూర్, ప్రభాతవార్త:

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం ద్వారా నిర్మించిన నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి పొరండ్ల సింగిల్ విండో చైర్మన్ గోపు మల్లారెడ్డిముఖ్య



అతిథిగా హాజరై గృహ యజమానులు దాసం ప్రేమ్ మంజుల గార్లకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గోపు మల్లారెడ్డి మాట్లాడుతూ, సొంత ఇల్లు ప్రతి పేద కుటుంబం కల అని, ఆ కలను సాకారం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ గృహాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా ప్రజాప్రతి నిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.నూతన గృహంలోకి అడుగుపెట్టిన కుటుంబ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆ ఇంట్లో ఎల్లప్పుడూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు నెలకొనాలని ఆకాంక్షి ంచారు. అనంతరం కుటుంబ సభ్యులు నూతనంగా పొరండ్ల సొసైటీ చైర్మన్ గా ఎన్నికైన గోపు మల్లారెడ్డి కి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మానకొండూరు నియోజకవర్గం ఉపాధ్యక్షులు తోర్తి అరవింద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కంది అశోక్ రెడ్డి, సాజిద్ మరియు గ్రామ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు

సీఎం రేవంతరెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం.

తిమ్మాపూర్, ప్రభాత వార్త :

తిమ్మాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు



బండారి రమేష్ ఆధ్వర్యం లో ఆదివారం మండలం లోని పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు కోట్ల నిధులు మంజూర్ చేసినందుకు కృతజ్ఞతగా సీఎం రేవంత్ రెడ్డి, పంచాయతీ రాజ్ మంత్రి సీతక్క , మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వం పల్లి సత్యనారాయణ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల వల్ల అభి వృద్ధి జరుగలేదని కాంగ్రెస్ ప్రభుత్వం తో అభివృద్ధి సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో పోరండ్ల, నుస్తులాపూర్ సొసైటీ చైర్మన్ లు గోపు మల్లారెడ్డి, రమణారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రవి, మాచర్ల అంజయ్య,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్. ఎల్ గౌడ్, తుమ్మనపల్లి శ్రీనివాస రావు పాల్గొన్నారు.

కాళేశ్వరం నీళ్లు వెంటనే విడుదల చెయ్యాలి

చిగురుమామిడి, ప్రభాత వార్త :

కాలేశ్వరం ప్రాజెక్టు సందర్శన సందర్భంగా కన్నెపల్లి పంప్ హౌస్ వద్ద భారత రాష్ట్ర సమితి కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమని, మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్ ప్రాంతానికి ఈ యొక్క కాలేశ్వరం నీళ్లు ఎంతో అవసరం అని, వెంటనే ఈ యొక్క పంపులను స్టార్ట్ చేసి చిగురుమామిడి మండల ప్రజలకు, హుస్నాబాద్ ప్రాంత ప్రజలకు నీరు అందించాలని చిగురుమామిడి మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్టు కన్నెపల్లి పంపు హౌజ్ సందర్శన సందర్భంగా ఆదివారం రోజు డిమాండ్ చేశారు. ఈ దుర్మార్గాలను భారత రాష్ట్ర సమితి ఖండిస్తుందన్నారు . ఈ కార్యక్రమంలో బొమ్మనపల్లి గ్రామ ఉపసర్పంచ్ కాసర్ల హరీష్ కుమార్,

కరీంనగర్ వార్త

బ్యాడ్మింటన్ టోర్నమెంటును ప్రారంభించిన అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి

కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:

క్రీడలతో ఒత్తిడి నుండి ఉపశమనం కలుగుతుందని,రోజువారీ కార్యకలాపాలను ఉత్సాహంగా చేపట్టగలుగుతామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, వీఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు,కరీంనగర్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ నరేందర్ రెడ్డి అన్నారు.ఆదివారం కరీంనగర్ లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో వీఎన్ఆర్ బ్యాడ్మింటన్





కప్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు క్రీడల పట్ల ప్రత్యేక దృష్టి సారించారని తద్వారా వారు ఉషారుగా ఉండడమే కాకుండా ఆరోగ్యకరమైన జీవితాన్ని గడుపతారని తెలిపారు.నేడు ప్రపంచంలో చాలామంది క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా వాటిలో పాల్గొని చక్కటి జీవితాన్ని వారు అనుభవిస్తున్నారని తెలిపారు. ప్రత్యేకంగా యువత క్రీడల పట్ల దృష్టి చారించి ఉపాధి అవకాశాలను మెరుగుప రుచుకోవాలని సూచించారు.ఎంతో మంది క్రీడలతో ఉద్యోగాలను సంపాది ంచారనీ,ఉత్తమమైన స్థానాలలో స్థిరపడి ఉన్నారని గుర్తు చేశారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా వీఎన్ఆర్ బ్యాడ్మింటన్ నిర్వహి ంచడం జరుగుతుందన్నారు. ప్రతిభ చూపిన వారికి నగదు ప్రోత్సాహకాలను అందించడం జరుగుతుందని చెప్పారు.అదేవిధంగా ప్రపంచ బ్యాడ్మింటన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ ని కట్ చేసి క్రీడాకారులు అందరికీ శుభాకాంక్షలు తెలిపి, క్రీడా స్ఫూర్తిని పరిరక్షి ంచాలని సూచించారు.. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి గుంటపల్లి స్వామి, మాస్టర్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రెటరీ బాబు, శంకర్, రాజిరెడ్డి,తదితరులు పాల్గొన్నారు....

వార్డు సభ్యులు తోట రజిత శ్రీనివాస్, కత్తుల లక్షి మ్మ, యువజన నాయకులు కత్తుల ప్రశాంతి, రైతు సంఘం విభాగం నాయకులు ముత్యాల కొమురయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు మాజీ ఎంపిటిసి కత్తుల రమేష్, మాజీ సర్పంచ్ కానుగంటి భూంరెడ్డి, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు, దేశిని రాజయ్య, కొంకట కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.



అమ్మ జన్మనిస్తే మొక్కలు పునర్జన్మనిస్తాయి....

.వన మహోత్సవంలో మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త:

అమ్మ జన్మనిస్తే మొక్కలు పునర్జన్మయిస్తాయని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) అన్నారు.జమ్మికుంట పట్టణంలో





ఆదివారం వనమహోత్సవంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మికుంట పట్టణంలో ప్రతి కౌన్సిలర్ ప్రతి పౌరుడు ప్రతి మహిళ అందరూ వారు నివాసం ఉంటున్న గృహాలలో ప్రతి ఒక్కరు భాగస్వాములై బాధ్యతగా మొక్కలు నాటాలనీ కోరారు. తల్లి జన్మనిస్తే మొక్కలు పునర్జన్మను ఇస్తాయని అన్నారు. పట్టణంలో పెరుగుతున్న జనాభా దృష్ట్యా కాలుష్యం నివారించాలంటే తప్పనిసరిగా మొక్కలు నాటాలనీ ఖాళీ ప్రదేశాలలో తప్పనిసరిగా గృహాలలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొలుగురి సురేష్, చందా రాజు, శానిటరీ ఇన్స్పెక్టర్ ఇల్లందుల రమేష్,బొళ్ళ సదానందం, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రీకాంత్ మున్సిపల్ కార్యాలయ సిబ్బంది సిఎల్ఆర్పి లు,ఆర్పి లు పాల్గొన్నారు.

తరగతి గదుల కొరతకు పరిష్కారం..

బుర్ర సుధాకర్ చొరవతో రెండు షెడ్లు నిర్మాణం...

కమలాపూర్: ప్రభాతవార్త.

కమలాపూర్ మండలం మాదన్నపేట ఎంపీపీఎస్ పాఠశాలలో తరగతి గదుల కొరత విద్యార్థుల చదువుకు అవరోధంగా మారింది. 5వ తరగతి వరకు ఉన్న ఈ పాఠశాలలో కేవలం 3 తరగతి గదులు మాత్రమే ఉండటంతో పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ విషయాన్ని గ్రామానికి చెందిన గంగు ప్రభాకర్ రావు గ్రామ వాస్తవ్యుడు బుర్ర సుధాకర్ దృష్టికి తీసుకువెళ్లారు. గతంలో గంగు ప్రభాకర్ రావు గ్రామ అభివృద్ధి కోసం చేసిన సేవలను ఆదర్శంగా తీసుకున్న బుర్ర సుధాకర్, "సొంత ఊరికి ఉన్నంతలో ఏదైనా చేయాలి" అనే సంకల్పంతో ముందుకు వచ్చారు.విద్యార్థుల ఇబ్బందులను గుర్తించిన ఆయన తక్షణమే రెండు షెడ్ల నిర్మాణానికి సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. ఆదివారం ఆ షెడ్ల నిర్మాణానికి ముగ్గు వేసి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కొత్త గదులు పూర్తయితే విద్యార్థులు ఇకపై ఎటువంటి ఇబ్బంది లేకుండా చదువుకోగలరు.ఈ మంచి కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కత్తి రమేష్, పాలకమండలి ఏఏపీసి ఛైర్మెన్ వసంత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు హాజరై బుర్ర సుధాకర్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.విద్య అభివృద్ధికి ఇలాంటి దాతల సహకారం ఎంతో అవసరమని, వారి సేవలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయని ఈ సందర్భంగా సర్పంచ్ కత్తి రమేష్ పేర్కొన్నారు.



కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీళ్ల ను లిఫ్ట్ చేసి రైతంగానికి అదుకోవాలి...

బిఆర్ఎస్ రాష్ట్ర యూత్ నాయకులు జువ్వాజి కుమార్...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త:

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీళ్లను లిఫ్ట్ చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జువ్వాజి కుమార్ అన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు



ద్వారా నీటిని ఉద్దేశపూర్వకంగా పంపింగ్ చేయడంలేదని ఆదివారం ఆయన కాళేశ్వరం ప్రాజెక్టు కన్నేపల్లి పంపుహౌజ్ సందర్శించడం జరిగింది. పోలిస్ లు ఎన్ని అడ్డంకులు సృష్టించి వెళ్లకుండా ఆపాలని ప్రయత్నంచిన ఆగకుండా ముందుకు సాగమన్నారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే నీళ్ల ప్రతిపాదికగా పోరాటం సాగింది.ఈరోజు సరైన వర్షాలు పడక రైతంగమంత కన్నీరు పెడుతున్నారని అన్నారు.రైతు కంట కన్నీరు రావొద్దు..నీళ్ల కోసం నింగి వైపు చూస్తూ తల్లడిల్లోద్దని అపర భగీరథుడు లాగా కెసిఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కడితే నేడు ఆ ప్రజెక్ట్ పై కుట్ర పూరిత ఆలోచనలతో కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి రైతు లను ఆరిగోస పెడుతున్నదనీ అన్నారు.వెంటనే కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని పంపింగ్ చేసి రిజర్వయర్లు నింపి తద్వారా రైతంగానికి నీటిని అందియాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు జిల్లా వైస్ చైర్మన్ పింగిలి రమేష్,మాజి మున్సిపల్ చైర్మన్ పోడేటి రామస్వామి,మాజి సర్పంచ్ దిలీప్ రెడ్డి,బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జేకే, ఎండి జానీ వొళ్ళాల శ్రీకాంత్ ,జోడు కుమారుస్వామి పాల్గొన్నారు.

కేటీఆర్ కన్నెపల్లి పంప్ హౌస్ పర్యటన..

బీఆర్ఎస్ నాయకుల ప్రివెంటివ్ అరెస్ట్

ప్రభాతవార్త.కమలాపూర్:

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం కన్నెపల్లి పంప్ హౌస్‌ను సందర్శించనున్న నేపథ్యంలో కమలాపూర్ పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు.కేటీఆర్ పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతిభద్రతలు కాపాడేందుకు బీఆర్ఎస్ పార్టీకి చెందిన



కొంతమంది నాయకులను ప్రివెంటివ్ కస్టడీకి తీసుకున్నట్లు కమలాపూర్ సీఐ నవీన్ తెలిపారు. అరెస్ట్ చేసిన వారిలో వంగపల్లి గ్రామానికి చెందిన నకిర్త రాజు, మర్రిపల్లి గ్రామానికి చెందిన కోడూరు తిరుపతి, మర్రిపల్లి గూడెం గ్రామానికి చెందిన వంగ రమేష్, తాడెం రాజేందర్, చేనమల్ల సాంబరాజు, రావుల సమ్మయ్య తదితరులు ఉన్నట్లు ఆయన వెల్లడించారు. కన్నెపల్లి పంప్ హౌస్ వద్ద పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు గుమిగూడే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు, ఇతర అల్లర్లు జరగకుండా ముందస్తుగా ఈ చర్యలు తీసుకున్నామని సీఐ నవీన్ పేర్కొన్నారు.

కౌలు రైతులు, వ్యవసాయ కూలీల హామీలను నెరవేర్చాలి

-- సీపీఎం పార్టీ ఇల్లంతకుంట మండల కార్యదర్శి చెల్పూరి రాము

ఇల్లందకుంట, ప్రభాత వార్త:

ఎన్నికల హామీలను గాలికొదిలేసి ప్రభుత్వం కౌలు రైతులను, వ్యవసాయ కూలీలను మోసం చేస్తోందని సీపీఎం ఇల్లంతకుంట మండల కార్యదర్శి చెల్పూరి రాము తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల సమయంలో కౌలు రైతులకు, కూలీలకు రూ. 15,000 భరోసా ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక కాలయాపన చేయడం దారుణమన్నారు. కౌలు రైతులకు చట్టబద్ధమైన గుర్తింపు లేకపోవడంతో బ్యాంకు రుణాలు, పంట బీమా, నష్టపరిహారం వంటి ప్రయోజనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, ఉపాధి హామీ పనుల్లో జాప్యం, కనీస వేతనాల అమలులో నిర్లక్ష్యం



వల్ల కూలీలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి సంక్షేమ పథకాలు అందించాలని, కూలీలకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో గ్రామాలవారీగా ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని రాము హెచ్చరించారు.




ఘనంగా నూతన గృహప్రవేశం

-- అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

-- మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని

జమ్మికుంట/హుజూరాబాద్, ప్రభాత వార్త:

హుజూరాబాద్ పట్టణంలోని 5వ వార్డులో కొలిపాక భాగ్యమ్మ – నారాయణ, కొలిపాక స్వరూప – శంకర్ దంపతుల నూతన గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా



మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని, 5వ వార్డు కౌన్సిలర్ సొల్లు సునీత – బాబు, హుజూరాబాద్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మేకల తిరుపతి, హనుమాన్ దేవస్థాన చైర్మన్ కొలిపాక శంకర్ లు విచ్చేసి రిబ్బన్ కట్ చేసి గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని కొనియాడారు. అనంతరం అదే వార్డులో ఉన్న శిథిలావస్థకు చేరిన కల్వర్టును ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానికుల ఇబ్బందులను గమనించి, త్వరలోనే నూతన కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా వార్డులో అవసరమైన నూతన వీధి దీపాలను ఏర్పాటు చేయిస్తామని, పట్టణంలోని డ్రైనేజీ నీరు గుండ్ల చెరువులో కలవకుండా తగు చర్యలు తీసుకుంటానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, వార్డు ప్రజలు పాక సతీష్, సిద్దమల్ల వెంకటేష్, కొలిపాక నవీన్, అశోక్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



సింగరేణి అధికారుల డిమాండ్లపై వెంటనే స్పందించాలి

రిలే నిరాహార దీక్షకు జనసేన నేత ఆర్.కే. సాగర్ సంఘీభావం

ప్రతి బొగ్గు పెళ్లలో కార్మికుడి గుండె చప్పుడు ఉంది..

కూలగొట్టడం కాదు..కట్టడాలపై దృష్టి పెట్టాలి

గోదావరిఖని, ప్రభాతవార్త:





సింగరేణి అధికారుల సంఘం చేపట్టిన రిలే నిరాహార దీక్షకు జనసేన పార్టీ తెలంగాణ ప్రచార కార్యదర్శి మొగిలిరేకుల ఆర్.కే. సాగర్ సంఘీభావం ప్రకటించారు. గోదావరిఖని జీఎం కాలనీలో కొనసాగుతున్న దీక్షా శిబిరాన్ని ఆదివారం సందర్శించిన ఆయన, ఉద్యమంలో పాల్గొంటున్న అధికారులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అధికారుల డిమాండ్లు న్యాయబద్ధమైనవేనని పేర్కొంటూ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం ఆలస్యం చేయకుండా చర్చలు ప్రారంభించి సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు.ఈ సందర్భంగా ఆర్.కే. సాగర్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ కేవలం బొగ్గు ఉత్పత్తి చేసే పరిశ్రమ మాత్రమే కాదని, తెలంగాణతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన ఆధారంగా నిలిచిన సంస్థ అని అన్నారు. వేలాది మంది కార్మికులు, అధికారులు తమ శ్రమతో సంస్థను దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టారని చెప్పారు. అలాంటి సంస్థలో అధికారులు తమ న్యాయమైన హక్కుల కోసం రిలే నిరాహార దీక్ష చేపట్టాల్సిన పరిస్థితి రావడం విచారకరమన్నారు.ప్రతి బొగ్గు పెళ్లలో సింగరేణి కార్మికుడి చెమట, గుండె చప్పుడు దాగి ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. దేశానికి వెలుగులు అందించేందుకు, పరిశ్రమలకు ఇంధనం సమకూర్చేందుకు సింగరేణి కార్మికులు ఎన్నో త్యాగాలు చేశారని గుర్తు చేశారు. ప్రమాదాలను ఎదుర్కొంటూ భూగర్భంలో, ఓపెన్‌కాస్ట్ గనుల్లో పనిచేస్తున్న కార్మికుల కష్టాన్ని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. కార్మికులతో పాటు అధికారులూ సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, ఇద్దరూ సమన్వయంతో పనిచేసినప్పుడే ఉత్పత్తి లక్ష్యాలు సాధ్యమవుతాయని అన్నారు.రామగుండం ప్రాంతానికి కార్మిక ఉద్యమాల చరిత్ర ఉందని సాగర్ గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమం నుంచి కార్మిక హక్కుల పోరాటాల వరకు ఈ ప్రాంత ప్రజలు ముందుండి పోరాడిన విషయాన్ని ప్రస్తావించారు. అలాంటి ప్రాంతంలో అధికారులు ఉద్యమ బాట పట్టడం వెనుక ఉన్న కారణాలను ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యలను నిరక్ష్యం చేస్తే అసంతృప్తి మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ప్రస్తుతం కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షను తేలికగా తీసుకోవద్దని ఆయన ప్రభుత్వానికి సూచించారు. చర్చలు జరపకుండా కాలయాపన చేస్తే ఉద్యమం మరింత ఉధృతమయ్యే అవకాశం ఉందన్నారు. పెన్‌డౌన్ ఉద్యమం వరకు పరిస్థితి వెళ్లితే సింగరేణి పరిపాలనా వ్యవస్థపై ప్రభావం పడటమే కాకుండా ఉత్పత్తి, నిర్వహణ, పరిపాలనా నిర్ణయాల్లో జాప్యం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీనివల్ల సంస్థ పనితీరుపై ప్రతికూల ప్రభావం పడుతుందని అభిప్రాయపడ్డారు.ప్రభుత్వం సమస్యలను మరింత జటిలం చేసే విధానాన్ని విడనాడాలని, కూలగొట్టే కార్యక్రమాల కంటే కట్టడాలపై దృష్టి పెట్టాలని ఆర్.కే. సాగర్ సూచించారు. ఉద్యోగులు, అధికారులు, కార్మికుల మధ్య విశ్వాసాన్ని పెంపొందించే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఏర్పాటులో సింగరేణి కార్మికుల పాత్ర ఎంతో కీలకమని, ఇప్పుడు వారి ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపైనే ఉందన్నారు.తాను రాజకీయ నాయకుడిగా కాకుండా సింగరేణి కార్మికుడి బిడ్డగా ఈ ఉద్యమానికి సంఘీభావం తెలుపుతున్నానని ఆర్.కే. సాగర్ స్పష్టం చేశారు. కార్మికులు, అధికారులు సంస్థకు రెండు కళ్లు వంటివారని, వారి సంక్షేమాన్ని కాపాడినప్పుడే సింగరేణి మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ప్రభుత్వం, యాజమాన్యం తక్షణమే అధికారుల సంఘం ప్రతినిధులతో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి సంస్థలో నెలకొన్న ప్రతిష్ఠంభనకు ముగింపు పలకాలని విజ్ఞప్తి చేశారు.దీక్షా శిబిరంలో సింగరేణి అధికారుల సంఘం నాయకులు దిటి చంద్రమోళి, రావుల దామోదర్, డాక్టర్ సందీప్, బైరి రాజు, హేమంత్, రాజేశ్వర్‌రావు, సద్దాం హుస్సేన్‌తో పాటు పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే జనసేన పార్టీ నాయకులు రావుల మధు, బేతి మహేందర్, రాజిరెడ్డి, హరీష్, రసూరి హరి, జనార్దన్, అరవింద్, రమేష్, తగరపు శ్రీనివాస్, మంథని శ్రవణ్, రాజేంద్ర ప్రసాద్, ఉదయ్‌రెడ్డి, విశ్వజ్ఞ, ఆశీత్, రాజశేఖర్, బషీర్, బూస శ్రీనివాస్, మేకల సంతోష్‌తో పాటు వీరమహిళలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఉద్యమానికి తమ సంఘీభావం ప్రకటించారు.

జూలై 10న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జిల్లాల ప్రశాంత్

సుల్తానాబాద్, ప్రభాతవార్త:



వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జూలై 10న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి జిల్లాల ప్రశాంత్ పిలుపునిచ్చారు. సుల్తానాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటికీ విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం దురదృష్టకరమని విమర్శిస్తూ, వెంటనే నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరతను తొలగించి శిథిలావస్థలో ఉన్న భవనాలకు కొత్త భవనాలు నిర్మించాలని, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు సకాలంలో అందించాలని కోరారు. ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించేందుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసి, జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తాండ్ర గౌతమ్ సాహూ, తాళ్లపల్లి రాజు, అరవింద్, నిఖిల్, అజయ్, అరుణ్‌కుమార్, అఖిల్, రేహాన్, ప్రణయ్, శశాంత్, అనిల్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

రాబోవు రోజుల్లో పది వేల మందితో
జిల్లా కలెక్టర్ ఆఫీసు ముట్టడి

ఆల్ సంఘాల ఐక్యవేదిక నాయకుడు పాటకుల మహేష్ హెచ్చరిక

పెద్దపల్లి జిల్లా కేంద్రంలో దళితులపై జరుగుతున్న దాడులపై రౌండ్ టేబుల్ సమావేశం

పెద్దపల్లి, ప్రభాతవార్త: రాబోవు రోజుల్లో 10వేల మందితో జిల్లా కలెక్టర్ ఆఫీసు ముట్టడిస్తామని ఆల్ సంఘాల ఐక్యవేదిక నాయకుడు పాటకుల మహేష్ హెచ్చరించారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గాయత్రి డిగ్రీ కళాశాలలో పాటకుల మహేష్ ఆధ్వర్యంలో ఆల్ సంఘాల ఐక్యవేదిక నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆల్ సంఘాల ఐక్యవేదిక నాయకుడు పాటకుల మహేష్ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో దళితులపై జరుగుతున్న దాడులు, అన్యాయాలు, ఎస్సీ, ఎస్టీ కేసుల నిర్వీర్యం జరుగుతున్న వాటి పరిష్కారాల గురించి ప్రతి ఒక్కరి అభిప్రాయాలు తీసుకున్నారు. రాబోవు రోజుల్లో జిల్లా కలెక్టర్ ఆఫీసును 10000 మందితో ఆల్ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ముట్టడిస్తామని తీర్మానం చేయడం జరిగిందని ఆల్ సంఘాల ఐక్యవేదిక నాయకుడు పాటకుల మహేష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, మాదిగ మహాశక్తి రాష్ట్ర కన్వీనర్ ఆసంపల్లి శ్రీనివాస్, ఆల్ ఇండియా తిప్పువతీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరు మధు, సీనియర్ అంబేద్కర్ సంఘం నాయకుడు కొంకంటి లింగమూర్తి, అంబేద్కర్ సంఘం జిల్లా నాయకుడు కుక్క అశోక్, బోసెల్లి నారాయణ, కుక్క శ్రవణ్, బీఎస్పీ టౌన్ ప్రెసిడెంట్ రామిళ్ళ శారద, అంబేద్కర్ సంఘం జిల్లా నాయకుడు బోసెల్లి మహేష్, రామలక్ష్మి, జిల్లా నాయకుడు ఉండంటి ప్రభాకర్, ఎర్రవెల్లి సురేందర్, పొనగంటి రాజన్న, సీనియర్ అంబేద్కర్ సంఘం నాయకుడు గూల్ల రాజు, నారాయణ మహేష్, బచ్చలి రాజయ్య, రామస్వామి, లింగమళ్ళ శంకర్ పాల్గొన్నారు.



పెద్దపల్లి వార్త



కన్నెపల్లి పంప్‌హౌస్‌కు వెళ్లకుండా బీఆర్ఎస్ నేతల అరెస్టు

సుల్తానాబాద్, ప్రభాతవార్త:



కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నెపల్లి పంప్‌హౌస్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సందర్శించనున్న నేపథ్యంలో, కన్నెపల్లి వెళ్లకుండా పోలీసులు సుల్తానాబాద్ కి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులను ఆదివారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. మాజీ ఎంపీటీసీ సూర శ్యామ్, మాజీ సర్పంచ్ బోయిన రాజమల్లయ్య, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి, గాజుల అరుణ్‌తో పాటు పలువురు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ తరలించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకపోయినా ముందస్తు చర్యల పేరిట తమను అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆరోపించారు. ప్రజాస్వామ్య హక్కులను హరించే చర్యలను ప్రభుత్వం విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

కేజ్ వీల్స్ తో ట్రాక్టర్ల రోడ్డుఎక్కితే భారీ జరిమానా

-జూలపల్లి ఎస్సై బుద్దె మల్లేష్

జూలపల్లి,ప్రభాతవార్త:



జూలపల్లి మండల పరిధిలోని రైతులు,ట్రాక్టర్ యజమానులందరికీ జూలపల్లి పోలీస్ శాఖ ప్రత్యేక విజ్ఞప్తి చేస్తోంది.పొలాల్లో దుక్కి దున్నేందుకు ఉపయోగించే కేజ్ వీల్స్ వేసి ట్రాక్టర్లను తారు రోడ్లపై నడపడం వల్ల రోడ్లు తీవ్రంగా దెబ్బతింటున్నాయని,దీనివల్ల ప్రభుత్వ ఆస్తి నష్టంతో పాటు ఇతర వాహనదారులకు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని గుర్తించడమైనది.ఈ సందర్భంగా ఎస్సై మల్లేష్ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా కేజ్ వీల్స్ అమర్చిన ట్రాక్టర్లను తారు రోడ్లపై నడపడం చట్టరీత్యా నేరం. నిబంధనలను అతిక్రమించి రోడ్లపై తిరిగే ట్రాక్టర్ల యజమానులకు రూ,, 5,000/ నుండి రూ,, 20,000/ వరకు జరిమానా విధించడం జరుగుతుంది.నిబంధనలను పదే పదే ఉల్లంఘిస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.రైతులు తమ వ్యవసాయ పనులు ముగించుకున్న తర్వాత,పొలం నుండి రోడ్డుపైకి వచ్చే ముందు తప్పనిసరిగా కేజ్ వీల్స్‌ను తొలగించి,సాధారణ ట్రైర్లను అమర్చుకోవాలి.ప్రజా భద్రతను,ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని,పోలీసులకు సహకరించాలని కోరుతున్నాము.నిబంధనలు పాటించని వారిపై ఇక పై కఠిన చర్యలు తీసుకోబడతాయని ఆయన తెలిపారు.

చొప్పదండి వార్త

ఇందిరమ్మ పథకం నిరుపేదలకు వరం

పేదల కళ్లలో వెలుగులు నింపుతున్న ప్రజా ప్రభుత్వం

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి,ప్రభాతవార్త:



రాష్ట్రం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వం లోని ప్రజా ప్రభుత్వం పేదల కళ్లలో వెలుగులు నింపుతుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం చొప్పదండి మండలం ఆర్నకొండ లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లో భాగంగా తిరుపతి రెడ్డి ఇందిరమ్మ ఇళ్ళు గృహప్రవేశం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేతుల మీదుగా జరిపించారు. వారి కుటుంబం కు కొత్త వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ కాలంలో, నేడు నిరుపేదల సంక్షేమం కోసం ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రవేశ పెట్టి ఇళ్లను నాడు నిర్మించి ఇస్తే, నేడు లబ్ధిదారులకు 5 లక్షలు ఇచ్చి వారే కట్టుకునే విధంగా అవకాశం కల్పించడం తో సంతోషంగా ఇళ్లను నిర్మించుకుంటున్నారని, ఇది ఎంతో శుభప్రదమైన, సంతోషకరమైన విషయం అన్నారు. ఒక్క ఇల్లు కూడా నిర్మించి ఇవ్వని బి ఆర్ ఎస్ నేతలు అడ్డమైన కూతలు కూస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కొండగట్టు ఉత్సవ ఆలయ కమిటీ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, చైర్ పర్సన్ వడ్నాల సరిత శ్రీనివాస్, వైస్ చైర్ పర్సన్ పెరుమండ్ల మానస గంగయ్య, ఆత్మ చైర్మన్ గుర్రం రాజేందర్ రెడ్డి, కౌన్సిలర్ ముద్దం రాజేశ్వరి తిరుపతి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నిజానపురం చందు, మహేషుని మల్లేశం, మచ్చ రమేష్, కేతిరెడ్డి మణిశంకర్ రెడ్డి, జక్కుల అనిల్ కుమార్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

పోయిన మొబైల్ ఫోన్స్‌ను యజమానికి అప్పగింత

చొప్పదండి,ప్రభాతవార్త:



చొప్పదండి పోలీస్ స్టేషన్ పరిధిలో పోయిన మొబైల్ ఫోన్లను పోలీసులు గుర్తించి, సాంకేతిక ఆధారాల సహాయంతో తిరిగి స్వాధీనం చేసుకున్నారు.మొబైల్ ఫోన్స్ యొక్క యజమానిని గుర్తించి, సంబంధిత ధృవీకరణ అనంతరం మొబైల్ ఫోన్లను ఆదివారం అధికారికంగా అప్పగించారు. ఈ సందర్భంగా తమ విలువైన మొబైల్ ఫోన్‌ను తిరిగి అందించిన పోలీసులకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, మొబైల్ ఫోన్ పోయిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో లేదా సి ఇ ఐ ఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయాలని ఎస్సై నరేష్ రెడ్డి ప్రజలకు సూచించారు.

యూనియన్ సమస్యల పరిష్కారం కై కృషి చేస్తాం

నూతన కమిటీ

చొప్పదండి,ప్రభాతవార్త:



ఆటో యూనియన్ సమస్యల పరిష్కారం కై కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన చొప్పదండి మినీ ఆటో డోర్ యూనియన్ కార్యవర్గం పేర్కొంది. ఈ మేరకు ఆదివారం ఆటో యూనియన్ సభ్యులు సమావేశం అయి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పాలూరి ప్రసాద్, ఉపాధ్యక్షులుగా రేగుల సతీష్, కోశాధికారిగా లంక రవి, ప్రధానకార్యదర్శిగ పోగుల రమేష్, గౌరవ అధ్యక్షులుగా యామ తిరుపతి, సలహాదారులుగా చొక్కాళ్ల లక్ష్మణ్, చొక్కాళ్ల రమేష్, కొక్కుల కుమార్, నరుకుల్ల గంగరాజు, తడగొండ వెంకటేష్, ఎగోళ్లపు రాజకుమార్, కళ్లెపెల్లి శంకరయ్య, వెలుగు రాజేందర్, పెరుమాళ్ళ సురేష్ లను ఎన్నుకున్నారు.

వైకుంఠ రథమును గ్రామపంచాయతీకి అందించిన ఎన్నారై తోట సత్యం

రామడుగు,ప్రభాత వార్తా :



రామడుగు మండల కేంద్రానికి చెందిన ఎన్నారై తోట సత్యం వారి తల్లిదండ్రులు అయినా తోట బుచ్చమ్మ వెంకటయ్య ల జ్ఞాపకార్థంగా గ్రామ పంచాయతీకి వైకుంఠ రథమును ఆదివారం నాడు స్థానిక వైశ్య భవన్ లో సర్పంచ్ మోయిస్ సమక్షంలో ఉచితంగా అందజేశాడు. ఈ సందర్భంగా తోట సత్యం మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన ఊరికి సేవ చేయాలనే సంకల్పంతో గతంలో డెడ్ బాడీ ఫ్రీజర్లు, వృద్ధులకు పెన్షన్లు, అనారోగ్య బాధితులకు ఆర్థిక సహాయం అందించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మొయిస్, పాలకవర్గం సభ్యులు నాయకులు నాగి శేఖర్, సముద్రాల శ్రీనివాస్, చంద అనిల్, కర్ణ శ్రీనివాస్, సిరిగిరి వెంకటేశం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల/ ప్రభాతవార్త

అర్హులైన నిరుపేదలకు సొంతింటి కలను సహకారం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు, ఆదివారం మల్యాల మండలం నూకపల్లిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా లబ్ధిదారుడైన కనకుంట్ల జలంధర్ లావణ్య నిర్మించిన ఇందిరమ్మ ఇంటి నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై ప్రారంభించారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ, నియోజకవర్గంలో అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని పేర్కొన్నారు, నూతన గృహ ప్రవేశం చేసిన సందర్భంగా లబ్ధిదారులకు ఎమ్మెల్యే నూతన వస్త్రాలను కానుకగా అందజేశారు,కాగా, బలవంతపూర్ గ్రామంలో చేపట్టిన శ్రీ సీతా రామ ఆలయ నిర్మాణం పనులను ఎమ్మెల్యే పరిశీలించి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు, కార్యక్రమంలో మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు శ్రీనివాస్, నాయకులు ఆనంద్ రెడ్డి , లక్ష్మణ్,అనిల్, దేవయ్య,మల్లయ్య, రవిగౌడ్ పలువురు కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు,



వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సర్పంచ్ బాల్నే జగదీశ్వర్ రెడ్డి

చిదినేపల్లిలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



కాటారం, జూలై 5, ప్రభాతవార్త

చిదినేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని దంతాలపల్లి గ్రామంలో గత మూడు రోజులుగా పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షాకాలం నేపథ్యంలో చాలా చోట్ల నీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో సర్పంచ్ బాల్నే జగదీశ్వర్ రెడ్డి అధ్యక్షతన జెసిబి సహాయంతో కచ్చా డ్రైన్ల (తాత్కాలిక మురుగు కాలువలు) పూడికతీత పనులు చేపట్టారు. ఆదివారం వార్డు సభ్యుడు కాయరి పోచమల్లు పర్యవేక్షణలో సాగిన కాలువల తవ్వకం పనులను సర్పంచ్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. వర్షాకాలంలో ఇళ్ల చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. నీరు నిలవడం వల్ల దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ పారిశుద్ధ్య కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు బాల్నే తిరుపతి రెడ్డి, బాల్నే ప్రవీణ్, ముత్యాల శంకరయ్య, బాల్నే ప్రకాష్ రెడ్డి, గజ్జల లింగయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాటారంలో నేడు పెంపుడు జంతువులకు ఉచిత యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్

ప్రపంచ జ్యూనోసిస్ దినోత్సవం సందర్భంగా

పశువైద్యాధికారి డాక్టర్ జి. రమేష్ పిలుపు

ఉచిత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మనవి

కాటారం, జూలై 5, ప్రభాతవార్త

కాటారం మండల కేంద్రంలోని ప్రాథమిక పశు వైద్యశాలలో నేడు సోమవారం ప్రపంచ జ్యూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరిం చుకొని పెంపుడు కుక్కలు, పిల్లులకు ఉచితంగా యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ జి. రమేష్ ప్రకటనలో తెలిపారు. మండలంలోని పెంపుడు జంతువుల యజమానులు ఈ అవకాశాన్ని గమనించి, తమ జంతువులకు సకాలంలో టీకాలు వేయించి సురక్షి తంగా ఉంచుకోవాలని ఆయన తెలిపారు. కావున ఇట్టి అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి కోరారు.

మల్యాల లోనడిరోడ్డుపై గుంతలతోవరి నాట్లు వేసి నిరసన

మల్యాల/ ప్రభాతవార్త



మల్యాల మేజర్ పంచాయతీలోని 8వ వార్డు ప్రధాన రోడ్డు మార్గం కొన్నేళ్లుగా చెడిపోయి గుంతలతో వర్షం నీటితో బురద మయమై ప్రజలు రాకపోకలకు అనేక అవస్థలు పడడంతో ఆదివారం బిఆర్ఎస్ నాయకులు దొంతర వేణి శేఖర్ ఆధ్వర్యంలో స్థానికులు రోడ్డుపై నిలిచిన బురదలో వరి నాట్లు వేసి తమ నిరసన తెలిపారు, ఈ మార్గంలో ప్రజల ఒత్తిడి చేస్తేనే మొరంపోసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చేయడం లేదని, అంతేకాకుండా డ్రైనేజీలను నిర్మించడం లేదని ఈ సందర్భంగా స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు, బస్టాండ్ సమీపంలో నుండి పెగడపల్లి వెళ్లే ఈ ప్రధాన మార్గం లో చిన్నపాటి వర్షానికి బురద నీరు నిలిచి వాహదారులుబాటసారులు కూడా కనీసం నడిచే వీలు లేకుండా పోయిందని, పలువురు వాహనదారులు బాటసారులు బురదలో జారిపడ్డ సంఘటనలు ఉన్నా సంబంధిత అధికారులు, గ్రామపంచాయతీ పట్టించుకోవడంలేదని దొంతర వేణి శేఖర్ ఆరోపించారు, రోడ్డు మార్గానికి శాశ్వత పరిష్కారంతోపాటు వార్డులో డ్రైనేజీలను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు,

వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం

చందుర్తి / ప్రభాతవార్త





చందుర్తి మండలం జోగాపూర్ గ్రామానికి చెందిన మొహమ్మద్ గౌస్ బ్రెయిన్ స్ట్రోక్‌తో కిమ్స్ హాస్పిటల్ హైద్రాబాద్‌లో ఐసీయూలో చికిత్స పొందుతూన్న గౌస్ ను మాజీ జెడ్పిటిసి నాగం కుమార్ ఆదివారం పరామర్శించి తమ వంతుగా ఆర్థిక సహాయం అందించారు, మొహమ్మద్ గౌస్ కు నిరంతరం వైద్య సహాయం వెంటిలేటర్,మెడికల్ అవసరమున్న నేపథ్యంలో కుటుంబ సభ్యులు తమ శక్తికి మించి 10లక్షలు ఖర్చు చేశారు ఇంకా 15లక్షలు అవసరం ఉండగా మాజీ జెడ్పిటిసి నాగం కుమార్ 5,000, మాజీ ఎంపీటీసీ మ్యాకల గణేష్ 5000, ఉప సర్పంచ్ గంట మల్లేశం 3,000/నాగం గణేష్ 2,500/కోరే పర్శరాములు 1,000/గద్దరాసి రాజు 1,000/చింతం శంకర్ 1,000/ధర్మపురి శ్రీనివాస్ 1,000/గాజుల శ్రవణ్ 1,000 మొత్తం 20,000 నగదు రూపాయలను ఆర్థిక సహాయంగా అందజేశారు,

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

చందుర్తి / ప్రభాతవార్త



చందుర్తి మండలం ఎన్గల్ గ్రామంలో ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడిన వార్డు సభ్యులు మెరుపుల రవి కుటుంబ సభ్యులను రాష్ట్ర వార్డు సభ్యుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా రవి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు . అనంతరం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుల ఫోరం నాయకులు బొమ్మనేని రాకేష్ రెడ్డి శ్రీరంగం సాగర్ నాగవెల్లి మహేష్ బైరు కిషోర్ కుమార్ లింగంపల్లి బాబు కాపిల్ల రాజు సాతల రవితేజ వెల్ది శ్రీకాంత్ పిట్లం మనోహర్ ఎదురుగట్ల అజయ్ తదితరులు ఉన్నారు. అనంతరం అన్ని గ్రామాల వార్డు సభ్యుల ఎగ్జిక్యూటివ్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

రుద్రంగి ప్రభాత వార్త :

పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మోతిరాం ప్రకటనలో తెలిపారు. ఎస్ఐ మోతిరాంతెలిపిన వివరాల ప్రకారం రుద్రంగి మండల కేంద్రంలో మానాల క్రాస్ రోడ్డు వద్ద వాహనల తనిఖీ నిర్వహిస్తుండగా నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలందేవక్కపేట గ్రామానికి చెందిన కుప్ప మహేష్ రుద్రంగి పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ తో వాగ్వాదానికి దిగారు. కానిస్టేబుల్తో వాగ్వాదానికిదిగడంతో పాటు ఆయన విధులకు ఆటంకం కలిగించే విధంగా వ్యవహరించడంతో అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూ కేసు నమోదు చేయడం జరిగిందనిఎస్ఐ మోతిరాం తెలిపారు.

పెరుక రాజుకు ఎన్టీఆర్ స్మారక కవితా పురస్కారం

చందుర్తి / ప్రభాతవార్త



తెలుగు భాషా సంరక్షణను ధ్యేయంగా చేసుకుని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కవులను ఒకే వేదికపైకి తీసుకువస్తున్న జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ విశ్వ సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో, నటసార్వభౌముడు, ప్రజానాయకుడు నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా నిర్వహించిన "సాహితీ తారకం" జాతీయ కవితల పోటీ విజయవంతంగా నిర్వహించారు,తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన ఎన్టీఆర్ స్మృతులను అక్షరార్చనగా మలిచే లక్ష్యంతో దేశ విదేశాల నుంచి అనేక మంది కవులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. నటనలో నవయుగ వైతాళికుడిగా, పాలనలో పేదల పెన్నిధిగా, తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహానాయకుడు ఎన్టీఆర్ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే విశిష్టమైన కవితలు ఈ పోటీలో సందర్శించబడ్డాయిఈ ప్రతిష్ఠాత్మక పోటీలో ప్రముఖ జాతీయ కవి, రచయిత, బహుభాషా వేత్త డా. పెరుక రాజు రచించిన కవిత భావగాంభీర్యం, భాషా సౌందర్యం, కవితాత్మక వ్యక్తీకరణతో ఎంపిక కమిటీని విశేషంగా ఆకట్టుకుని, ఎన్టీఆర్ స్మారక కవితా పురస్కారం 2026కు ఎంపికైంది.ఈ సందర్భంగా ఆదివారం నెల్లూరులోని డి.కె.డబ్ల్యూ. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ గజల్ గాయకుడు డా. గజల్ శ్రీనివాస్, విశ్వ సాహితీ కళావేదిక అధ్యక్షురాలు కె. రమావతి, శ్రీమతి మాహేశ్వరి, వన్నం బ్రహ్మయ్య, కోటంరెడ్డి, స్థానిక శాసనసభ్యులు, సంస్థ కార్యవర్గ సభ్యుల చేతుల మీదుగా డా. పెరుక రాజుకు "ఎన్టీఆర్ స్మారక కవితా పురస్కారం", జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువాతో సన్మానించి నగదు బహుమతి ప్రదానం చేశారు..పెరుక రాజు కవిగా రచయితగా, బహుభాషా వేత్తగా దేశవ్యాప్తంగా మాత్రమే కాకుండా విదేశాల్లోనూ విశేషమైన సాహిత్యాభిమానులను సంపాదించుకున్నారు. ప్రస్తుతం భారత రక్షణ శాఖ ఆర్మీ విభాగంలో జూనియర్ కమిషన్డ్ అధికారిగా విధులు నిర్వహిస్తూ, ఉద్యోగ బాధ్యతలతో పాటు సాహిత్య సేవలను నిరంతరం కొనసాగిస్తున్నారు. అలాగే "మై గిఫ్ట్ యువ సంస్థ" రూపశిల్పిగా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.డా. పెరుక రాజుకు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడం పట్ల సాహితీవేత్తలు, కవులు, కళాకారులు, సామాజికవేత్తలు, సాహిత్యాభిమానులు, మిలిటరీ మిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

ఎదురుగట్లకు రూ.20 లక్షల వరం

ఎల్లమ్మ ఆలయ రహదారికి ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవ

వేములవాడ రూరల్ ప్రభాత వార్త:



వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల గ్రామంలోని ఎల్లమ్మ ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.20 లక్షల నిధులను మంజూరు చేసింది. ఈ నిధులను మంజూరు చేయించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు పొన్నం మల్లేశం గౌడ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎల్లమ్మ ఆలయం, గ్రామ స్మశానవాటిక, బతుకమ్మ తెప్ప, కల్లు మండువా, అలాగే వ్యవసాయ భూములకు వెళ్లే ఈ రహదారి ఎన్నో సంవత్సరాలుగా అధ్వాన్నంగా ఉండటంతో గ్రామ ప్రజలు, రైతులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వర్షాకాలంలో రహదారి మరింత దెబ్బతిని రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడేదని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు.గ్రామ ప్రజల అవసరాన్ని గుర్తించి వెంటనే స్పందించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ రూ.20 లక్షల నిధులు మంజూరు చేయించడం అభినందనీయమని అన్నారు. రహదారి నిర్మాణం పూర్తయితే ఆలయానికి వచ్చే భక్తులు, రైతులు, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు సౌకర్యవంతంగా రాకపోకలు సాగించే అవకాశం ఉంటుందని తెలిపారు.అలాగే ఈ రహదారి మంజూరు కోసం ప్రత్యేకంగా కృషి చేసిన వేములవాడ రూరల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సోయినేని కరుణాకర్‌కు కూడా పొన్నం మల్లేశం గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఇదే విధంగా సహకారం అందిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని కొనియాడారు.గ్రామ ప్రజల చిరకాల కోరిక నెరవేరడంతో ఎదురుగట్ల గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొన్నట్లు స్థానికులు తెలిపారు.

వేములవాడ వార్త

చందుర్తి, మోత్కురావుపేట రోడ్డు నిర్మాణానికి రూ.17.06 కోట్ల మంజూరు

చందుర్తి / ప్రభాతవార్త



చందుర్తి మోత్కురావుపేట రహదారి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.17.06 కోట్లు మంజూరు చేసినట్లు చందుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొట్టె ప్రభాకర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కృషితో ఈ నిధులు మంజూరయ్యాయని చెప్పారు. గత పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న పాలకులు రహదారిని పట్టించుకోలేదని తెలిపారు, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎప్పటికప్పటికీ రోడ్డు నిర్మాణ నిధుల మంజూరు కోసం ప్రభుత్వం దగ్గరికి వెళ్లి రహదారికి గల ఇబ్బందులను తొలగించి నిధులు మంజూరు చేశారని తెలిపారు, ఈ రహదారి నిర్మాణంతో చందుర్తి మోత్కురావుపేట భీమారం, మేడిపల్లి తదితర మండల ప్రజల ఇబ్బందులు తొలగనున్నయన్నారు, రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఆది శ్రీనివాస్ కు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ఆయా మండలాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు, అభివృద్ధిలో వేములవాడను పరుగులు పెట్టిస్తున్న ఆది శ్రీనివాస్ కు ఈ ప్రాంత ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయి అన్నారు,అలాగే వేముల వాడ, కోరుట్ల మూడు లేన్ల రహదారి నిర్మాణానికి రూ.88.45 కోట్లతో నిధులు మంజూరు అయినట్లు పేర్కొన్నారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి చింతపంటి రామస్వామి, నాయకులు దేవస్వామి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే మండలాభివృద్ధి సాధ్యం..!

మండలాధ్యక్షుడు సత్యంసీసీ రోడ్లు,

భవన నిర్మాణాలకు నిధుల మంజూరు

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:

మారుమూల మండలమైన కోనరావుపేట కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి చెందుతుంది కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మానుక సత్యం అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మండలంలో సీసీ రోడ్లు,గ్రామ పంచాయితీ, విఓ సంఘ భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు.నాగారం గ్రామ పంచాయితీ భవన నిర్మాణానికి రూ.20లక్షలు, మహిళా సమాఖ్య సంఘ భవన నిర్మాణానికి రూ. 10లక్షలు, కోనరావుపేట గ్రామానికి సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.17 లక్షలు, మల్కాపేటలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.లక్ష 50 వేలు,మర్థనపేట్ గ్రామానికి సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. నాలుగు గ్రామాలకు ఉపాధి హామీ పథకం ద్వారా భవన నిర్మాణాలకు, సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.63 లక్షల 50 వేలు మంజూరు కాగా వాటికీ సంబందించిన ప్రొసీడింగలు ఆయా గ్రామాల సర్పంచ్ లకు నాయకులకు అందించమన్నారు. మండల అభివృద్ధి కోసం నిధుల మంజూరు కు కృషిచేసిన రాష్ట్ర ప్రభుత్వ విఫ్ ఆది శ్రీనివాస్ కు సత్యం కృతజ్ఞతలు తెలిపారు.సర్పంచ్ లు కాశీరం,నాగభూషణం, దేవ రాజు, దీపిక,జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చేపూరి గంగాధర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, గొట్టే రుక్మిణి,కరెడ్ల రమేష్ రెడ్డి, రాస రవి, గోపాల్, లింబయ్య, కుంట శ్రీనివాస్, కార్తీక్, జి.శంకర్,సత్యం, ప్రదీప్ ఉన్నారు.

విధుషేఖర భారతి స్వామిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రభుత్వ విప్

వేములవాడ, ప్రభాతవార్త:

విధుషేఖర భారతి స్వామిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆదివారం ఖమ్మం జిల్లా కేంద్రంలో జగద్గురు దక్షిణ నమ్నాయ శృంగేరి శారద పీఠాధిపతులు విధుషేఖర భారతి స్వామి పర్యటిస్తున్న సందర్భంగా కలిశారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ స్వామి దర్శనం చేసుకుని వేద ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పీఠాధిపతులు విధుషేఖర భారతి స్వామి దేశ కల్యాణం కోసం చేస్తున్న పర్యటనలు అభినందనీయమన్నారు.

సింగరేణిలో కోట్ల స్కాంలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

స్కాంలకు స్కీం లకు పుట్టినిల్లు కాంగ్రెస్

సింగరేణిలో రాజకీయ జోక్యంతో సంస్థ మనుగడకు ముప్పు

సింగరేణి అధికారుల సమ్మెకు బీజేపీ పూర్తి మద్దతు

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందుపట్ల సునీల్ రెడ్డి

రామగిరి ప్రభాతవార్త



సింగరేణిలో కోట్ల రూపాయల స్కాం లకు పాల్పడి కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటుందని, స్కాం లకు స్కీములకు పుట్టినిల్లు కాంగ్రెస్ అని, సింగరేణిలో రాజకీయ జోక్యంతో సంస్థ మనుగడకు ముప్పు వాటిల్లుతుందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందుపట్ల సునీల్ రెడ్డి అన్నారు. రామగుండం ఆర్ జి3 ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదురుగా సింగరేణి సీఎండి ఏ ఐ అధికారుల సంఘం ఆధ్వర్యంలో పిఆర్ పి, పి ఆర్ సి అమలు కోసం గత వారం రోజులుగా కొనసాగుతున్న నిరవధిక సమ్మెకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి ఆదివారం దీక్షను సందర్శించి మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మెకు బిజెపి పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బొగ్గు !! గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి సమక్షంలో సింగరేణిపై జరిగిన సమీక్ష సమావేశంలో సింగరేణి అధికారుల సమ్మెకు దారితీసిన సమస్యలను వివరించినట్లు తెలిపారు. అధికారుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరించేలా సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు.అలాగే, సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం బీజేపీ పార్టీ తరఫున తన పూర్తి మద్దతు, సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.సింగరేణిలో జరిగే అన్ని రకాల కుంభకోణాలను బట్టబయలు చేస్తామని ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తమ వైఖరి మార్చుకోవాలని మన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మొన్నటికి మొన్న సింగరేణి వ్యవస్థలో కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు 1600 కోట్ల స్కాం చేసిందని అసలు స్కాంలకు పుట్టినిల్లు కాంగ్రెస్ పార్టీ అని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని లేనియెడల పెద్ద ఎత్తున బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు కొండు లక్ష్మణ్, వీరబోయిన రాజేందర్, కొయ్యడ సతీష్, ప్రధాన కార్యదర్శి తోట్ల రాజు , ఓబీసీ అధ్యక్షుడు మైదాం సందీప్, కార్యదర్శి కొత్త కమలాకర్, బి ఎం ఎస్ నాయకులు, రౌతు రమేష్ పటేల్, కందుల మహేష్, ఉస్కామల్ల వంశీ, సంతోష్, తిరుపతి,జిల్లా కౌన్సిల్ సభ్యులు తోట మధుకర్, జిల్లా సీనియర్ నాయకులు మట్ట శంకర్, మల్లారపు అరుణ్ కుమార్, మండల నాయకులు విశ్వతేజ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి పోస్ట్ రిజర్వేషన్ జనాభాకు అనుగుణంగానే కేటాయించాలి

మచ్చుపేట మాజీ వార్డు సభ్యురాలు బూర్ల రజిత

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ రద్దు చేసి బీసీ రిజర్వేషన్

కేటాయించాలని డిమాండ్

ముత్తారం, ప్రభాతవార్త:



ముత్తారం మండలంలోని మచ్చుపేట జిపి పరిధి శుక్రవారం పేట గ్రామంలోని అంగన్వాడి పోస్ట్ రిజర్వేషన్ జనాభాకు అనుగుణంగానే కేటాయించాలని మచ్చుపేట మాజీ వార్డు సభ్యురాలు బూర్ల రజిత ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శుక్రవారం పేట అంగన్వాడి కార్యకర్త అనారోగ్యం కారణంగా రాజీనామా చేయడం జరిగిందని, ప్రస్తుతం ఆ పోస్టును భర్తీ చేయడం కొరకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కేటాయించారని తెలిపారు. వాస్తవంగా శుక్రవారం పేట అంగన్వాడి కేంద్రం పరిధిలో ఒకరు కూడా ఓసి లేరని స్పష్టం చేశారు. ఇదే అంగన్వాడి కేంద్రానికి గతంలో ఓసికి కేటాయించడంతో మచ్చుపేట గ్రామస్తులు అంగన్వాడి కార్యకర్తగా పని చేశారని, ప్రస్తుతం కూడా మచ్చుపేట గ్రామస్తులకే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కేటాయించడం వల్ల అంగన్వాడి కేంద్రం పరిధిలోని వారికి కాకుండా మచ్చుపేట గ్రామస్తులకే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆమ్లెట్ గ్రామానికి న్యాయం జరిగేలా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ రద్దుచేసి అక్కడ జనాభాకు అనుకూలంగా అంగన్వాడి పోస్టుకు బీసీ రిజర్వేషన్ కేటాయించాలని మాజీ వార్డు సభ్యురాలు బూర్ల రజిత కోరారు.

బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

ముత్తారం, ప్రభాతవార్త:



బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కన్నెపల్లి పంప్ హౌస్ పర్యటనకు వెళ్తున్న సందర్భంగా తరలివెళ్తారని ముత్తారం మండల బి ఆర్ ఎస్ పార్టీ నాయకులను ముందస్తుగా ముత్తారం పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నూనె కుమార్, బిఆర్ఎస్ నాయకులు మధు, అలుపోజు రవీందర్, శేరు స్వామితోపాటు పలువురున్నారు

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

రఘునాథపల్లి, జూలై 5 ప్రభాతవార్త:

బీఆర్ఎస్ రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కన్నెపల్లి పంప్‌హౌస్ సందర్శన పర్యటన నేపథ్యంలో పోలీసులు రఘునాథపల్లి మండలంలోని బీఆర్ఎస్ నాయకులను శనివారం రాత్రి ముందస్తు అరెస్టుచేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయినవారిలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వై.కుమార్‌గౌడ్, ఎడ్ల బాలరాజు, రాజేష్, రాకేష్ తదితరులు ఉన్నారు.

పెంబర్తివద్ద కేటీఆర్ కాన్వాయ్ అడ్డుకున్న పోలీసులు

- కన్నెపల్లి పంప్‌హౌస్ పర్యటనలో ఉద్రిక్తత

ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :

జనగామ జిల్లా కన్నెపల్లి పంప్‌హౌస్ సందర్శనకు వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కాన్వాయ్‌ను పోలీసులు పెంబర్తివద్ద బారికేడ్లు ఏర్పాటుచేసి అడ్డుకోవడంతో ఆదివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.కన్నెపల్లి పంప్‌హౌస్ పర్యటనకోసం హైదరాబాద్ నుంచి బయలుదేరిన కేటీఆర్‌వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అయితే పెంబర్తి సమీపంలో పోలీసులు రోడ్డుకుఅడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేసి కాన్వాయ్‌ను నిలిపివేశారు. దీంతో కేటీఆర్ వాహనం నుంచి దిగి పోలీసు అధికారులతో మాట్లాడారు.శాంతియుతంగా పంప్ హౌస్‌ను సందర్శించేందుకు వెళ్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని కేటీఆర్ పోలీసులను ప్రశ్నించినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.కేటీఆర్ కాన్వాయ్‌ను అడ్డుకున్నారనే సమాచారం తెలిసి జనగామ జిల్లా పరిసర ప్రాంతాలనుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెంబర్తికి చేరుకోవడంతో అక్కడ జనసందోహం పెరిగింది. పరిస్థితి అదుపులో ఉండేలా పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటుచేసి, ట్రాఫిక్‌ను నియంత్రించారు.

- కోమల్ల టోల్‌ప్లాజా వద్ద కేటీఆర్‌ను అడ్డుకున్న పోలీసులు..:

కన్నెపల్లి పంప్‌హౌజ్ సందర్శనకు తరలివెల్లుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను రఘునాథపల్లి మండలంలోని కోమల్ల టోల్‌గేట్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో వాగ్వాదం జరుగగా టోల్‌ప్లాజావద్ద అరగంటపాటు ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. ఈ చర్యను బీఆర్ఎస్ నాయకులు ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు.

మంథని వార్త



బేగంపేట గ్రామ అభివృద్ధికి నిధుల మంజూరు

మంత్రి దుద్దిళ్లకు కృతజ్ఞతలు తెలిపిన

సీనియర్ కాంగ్రెస్ నాయకులు శివ

రామగిరి ప్రభాతవార్త



రామగిరి మండలం బేగంపేట గ్రామ అభివృద్ధి పనుల కొరకు నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దాసరి శివ కృతజ్ఞతలు తెలిపారు.ఇటీవలే మంత్రి శ్రీధర్ బాబును కలిసిన దాసరి శివ బేగంపేట గ్రామంలోని పలు సమస్యల పరిష్కారం కోసం సమగ్ర నివేదిక అందజేయగా స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు బేగంపేటకు నిధులు విడదల చేశారు. దీంతో గ్రామం మరింత అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టితో ముందుకెళ్తుందని అన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే

ముత్తారం, ప్రభాతవార్త:



ముత్తారం మండల కేంద్రంలోని వెంకటలక్ష్మి గార్డెన్స్‌లో కేశనపల్లి మాజీ ఎంపిటిసి, మండల బి ఆర్ ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు పప్పు స్వరూప చంద్రమోళి కుమార్తె తేజశ్విని రాజ్‌కుమార్ వివాహ వేడుకలు ఆదివారం జరిగాయి. ఈ వేడుకల్లో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ శైలజ దంపతులు పాల్గొని, నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట బి ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు పోతెపెద్ది కిషన్ రెడ్డి, మాజీ సర్పంచ్ నూనె కుమార్, ఓడేడు సర్పంచ్ పోతెపెద్ది కవిత, ముత్తారం సర్పంచ్ సుదాటి రవీందర్ రావు, పలువురు బి ఆర్ ఎస్ నాయకులున్నారు.

పచ్చదనంతో ప్రయాణీకులను ఆకర్షిస్తున్న రోడ్డుమార్గం

చిల్పూర్, జూలై 5 ప్రభాతవార్త :

చిల్పూర్ మండలం చిన్నపెండ్యాల నుంచి తరిగొప్పుల వెళ్లే రోడ్డుమార్గంలో పచ్చనిచెట్లతో రంగురంగు పువ్వులతో ప్రయాణికులను మైమరిపించేవిధంగా అందగా కనిపిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు ఆగి ఆకర్షిస్తున్న అందాలతో ఫోటోలు దిగుతున్నారు. ప్రయాణీకులను ఆనందంపరుస్తున్న పచ్చని రోడ్డుమార్గం. రహదారికి ఇరువైపులా ప్రకాశవంతమైన నారింజ, ఎరుపురంగుచెట్లు పందిరిలాంటి ప్రభావాన్ని సృష్టిస్తుంది. ఈ దృశ్యం చిన్నపెండ్యాల నుండి చిల్పూర్ దేవస్థానం వెళ్లేమార్గంలో కనిపిస్తుంది. చెట్లు వాటి విశాలమైన కొమ్మలతో చక్కని నీడను ఇవ్వడమే కాకుండా, పర్యావరణానికి అందాన్ని చేకూరుస్తున్నాయి. సాధారణంగా ఎండాకాలంలో (ఏప్రిల్ నుండి జూన్ వరకు) పూస్తాయి. ఆ సమయంలో చెట్టుమొత్తం ఆకుపచ్చని ఆకులకంటే ఎరుపు లేదా నారింజరంగు పూలతోనే ఎక్కువగా కనిపిస్తుంది.

గ్రామాన్ని పచ్చని వనంగా తీర్చిదిద్దే సంకల్పానికి శ్రీకారం

నేడు నాటిన మొక్కే... రేపటి తరాలకు జీవన భరోసా

రాజారాంపల్లిలో జై హనుమాన్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో

విడతల వారీగా వృక్షారోహణకు శ్రీకారం

ఎండపల్లి ప్రభాతవార్త

ఒక మొక్క నాటితే... భవిష్యత్ తరాలకు జీవనాధారం అవుతుంది. అదే మనం అందించే గొప్ప వారసత్వం" అనే సందేశాన్ని ఆచరణలో చూపిస్తూ జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామంలో ఆదివారం జై హనుమాన్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వృక్షారోహణ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్, ఎండపల్లి సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సంగ రమేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామ ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా జై హనుమాన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు జల్లెళ్ల తిర్మలేష్ యాదవ్ మాట్లాడుచూ గ్రామ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని వృక్షారోహణ కార్యక్రమాన్ని విడతల వారీగా నిర్వహించాలని కమిటీ నిర్ణయించిందన్నారు. మొదటి విడతలో గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి బీరయ్య దేవాలయం వరకు నీడనిచ్చే మొక్కలను నాటుతున్నట్లు తెలిపారు. అలాగే నూతనంగా నిర్మించనున్న శివాలయం, సమ్మక్క-సారలమ్మ గద్దెల పరిసరాల్లో పండ్ల మొక్కలను



నాటినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మొక్కల దాతలుగా సంగ సంజీవ్ తన తల్లి జ్ఞాపకార్థం, సుధమల్ల వంశి తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం, సంగ సాయి ప్రకాష్ తన తల్లి జ్ఞాపకార్థం, పన్నాల అనిల్ తన తమ్ముడి జ్ఞాపకార్థం, సుధమల్ల రాజశేఖర్ తదితరులు ముందుకు వచ్చి మొక్కలను అందజేశారు. వారి సేవాభావాన్ని కమిటీ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ప్రజలంతా చెట్ల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా భావించి ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని విజ్ఞప్తి చేశారు. పచ్చదనమే పర్యావరణ పరిరక్షణకు మూలమని, మొక్కలను నాటి వాటిని కాపాడడం ద్వారానే భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించగలమని పేర్కొన్నారు.

మార్పు దిశగా శివాజీనగర్ మార్కెట్..

పరిశుభ్రతకు వ్యాపారుల సహకారం అభినందనీయం

చెత్త వేస్తే లీజు, లైసెన్స్ రద్దు తప్పదు

మార్కెట్‌కు 40 అడుగుల రహదారి త్వరలో ప్రారంభం

గోదావరిఖని, ప్రభాతవార్త:



రామగుండం నగరంలోని శివాజీనగర్ కూరగాయల మార్కెట్‌లో క్రమంగా కనిపిస్తున్న మార్పు ఆశాజనకమని నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. ప్రజలకు పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన మార్కెట్‌ను అందించాలంటే వ్యాపారులు, అధికారులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆదివారం మార్కెట్‌ను సందర్శించిన ఆయన అక్కడ చేపట్టిన పరిశుభ్రత చర్యలు, మౌలిక వసతుల పురోగతిని పరిశీలించి వ్యాపారులతో మాట్లాడారు.వారం రోజుల క్రితం వార్డు పర్యటన సందర్భంగా మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, అక్రమంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు, తాత్కాలిక పరదాలను తొలగించాలని సూచించినట్లు మేయర్ గుర్తు చేశారు. ఆ సూచనలకు వ్యాపారుల నుంచి ఆశించిన స్పందన లభించిందని తెలిపారు. విద్యుత్ తీగలను క్రమబద్ధీకరించి, రేకులతో దుకాణాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల మార్కెట్ రూపురేఖలు మారుతున్నాయని అన్నారు. త్వరలోనే ప్లాట్‌ఫారాల నిర్మాణం కూడా పూర్తయితే మార్కెట్ మరింత ఆకర్షణీయంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.పరిశుభ్రత విషయంలో నగరపాలక సంస్థ రాజీపడదని మేయర్ స్పష్టం చేశారు. ఇటీవల ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో 50 మంది సిబ్బంది, జేసీబీ యంత్రాలతో మార్కెట్‌ను పూర్తిస్థాయిలో శుభ్రపరిచినట్లు తెలిపారు. ఆ కృషి వృథా కాకుండా వ్యాపారులు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలు విధించడమే కాకుండా అవసరమైతే మార్కెట్ గదుల లీజులు, వ్యాపార లైసెన్సులను కూడా రద్దు చేసి ఇతరులకు కేటాయించే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వర్షాకాలం దృష్ట్యా ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని మేయర్ సూచించారు. ముఖ్యంగా మాంసం విక్రయదారులు పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, అపరిశుభ్ర వాతావరణంలో విక్రయాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మార్కెట్‌కు వచ్చే ప్రతి వినియోగదారుడు సురక్షిత వాతావరణంలో కొనుగోళ్లు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.మార్కెట్‌కు అనుసంధానంగా ఉన్న ప్రధాన రహదారి సమస్యకు కూడా త్వరలో పరిష్కారం లభించనుందని మేయర్ తెలిపారు. మరో నాలుగు రోజుల్లో 40 అడుగుల వెడల్పుతో రహదారి నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. దీంతో ట్రాఫిక్ సమస్య తగ్గడంతో పాటు వ్యాపార కార్యకలాపాలకు మరింత ఊతం లభిస్తుందని చెప్పారు.అనంతరం ఇందిరానగర్, ఎన్‌టీపీసీ కట్రస్థాన్, రామగుండం ప్రాంతాల్లో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను మేయర్ పరిశీలించారు. స్థానికుల నుంచి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులకు వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకతతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వేగంగా పూర్తి చేయాలని సూచించారు.ఈ పర్యటనలో పలువురు కార్పొరేటర్లు, నగరపాలక సంస్థ ఏఈ మీర్, టీపీఎస్ నవీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ గోపీకృష్ణతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, వ్యాపారులు, అధికారులు సమిష్టిగా సహకరించాలని మేయర్ మహంకాళి స్వామి పిలుపునిచ్చారు.

కాలేశ్వరం కోసం బీఆర్ఎస్ నిరసన

కౌశిక్ హరి, లత అరెస్ట్ ..కన్నెపల్లికి వెళ్లకుండా నిర్బంధం

రైతుల కోసం పోరాటం కొనసాగుతుంది

ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు

గోదావరిఖని, ప్రభాతవార్త:



కాలేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద మోటార్లను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమానికి బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రామగుండం నుంచి కన్నెపల్లి పంప్‌హౌస్‌కు వెళ్లేందుకు సిద్ధమైన పార్టీ ముఖ్య నాయకులు కౌశిక్ హరి, లతలను పోలీసులు ముందస్తుగా నిర్బంధించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ రైతుల ప్రయోజనాల కోసం, సాగునీటి అవసరాల కోసం నిర్వహిస్తున్న శాంతియుత నిరసనను అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నాన్ని అక్రమ అరెస్టులతో అణచివేయాలని చూడడం సరికాదన్నారు. ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతులను నిర్బంధాలతో ఆపలేరని, రైతాంగ ప్రయోజనాల కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.కాలేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కన్నెపల్లి పంప్‌హౌస్‌లో మోటార్లను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రైతుల ఇబ్బందులను పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు.నిరసన కార్యక్రమంలో 28వ డివిజన్ కార్పొరేటర్ దారంగుల కుమార్, కార్పొరేటర్లు నిమ్మరాజుల రజిని-రవి, మద్దికుంట శంకర్, జరుపుల శ్రీనివాస్, రవి నాని, ఇన్నూస్, మంచినీళ్ల రాకేష్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పోలీసులు నాయకులను అదుపులోకి తీసుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

ధర్మపురి వార్త

నృసింహాలయంలో గంగోత్రి మఠం

పీఠాధిపతి పూజలు

ధర్మపురి, ప్రభాతవార్త





ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని శ్రీ వైష్ణవ గంగోత్రి మఠం పీఠాధిపతి శ్రీ ఆచార్య రామానుజ దాస్ ఆదివారం దర్శించుకుని పూజలు నిర్వహించారు. పీఠాధిపతి ఆలయం వద్దకు రాగానే దేవస్థానం అర్చకులు, అధికారులు పూర్ణకుంభ స్వాగతంతో ఆలయంలోకి ఆహ్వానించారు. అనంతరం దేవాలయంలోని అన్ని ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి శేషవస్త్రం తో పాటు ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకోవడం అదృష్టంగా భావించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ అల్వాల శ్రీనివాస్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈశా గ్రామోత్సవం విజయవంతం చేయాలి

18, 19న క్రీడా పోటీలు..

ఈశా ఫౌండేషన్ వాలంటీర్ ప్రణయ

సుల్తానాబాద్,ప్రభాతవార్త:



ఈ నెల 18, 19 తేదీల్లో మానకొండూరు జెడ్పీహెచ్ఎస్ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించే ఈశా గ్రామోత్సవాన్ని విజయవంతం చేయాలని ఈశా ఫౌండేషన్ వాలంటీర్ ప్రణయ కోరారు. ఆదివారం మండలంలోని గర్రెపల్లి గ్రామంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా సీనియర్ వాలీబాల్ పోటీల్లో ఆమె పాల్గొని గ్రామోత్సవంపై అవగాహన కల్పించారు. పురుషుల వాలీబాల్, మహిళల త్రోబాల్ పోటీలకు గ్రామాల వారీగా జట్లు ఉచితంగా నమోదు చేసుకోవచ్చన్నారు. గ్రామీణ యువత అధిక సంఖ్యలో పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. విజేతలకు నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉండి పాల్గొనాలి అనుకునే క్రీడాకారులు 9885456736, నెంబర్ను సంప్రదించాలని కోరారు.

పెద్దబొంకూర్‌లో రెచ్చిపోతున్న ఇసుక, మొరం మాఫియా

నిబంధనలకు విరుద్ధంగా రాత్రి, పగలు వాహనాలతో తరలింపు

ఫిర్యాదు చేసిన పట్టించుకోని ఉన్నతాధికారులు

అడ్డుకోబోయినందుకు చంపుతామని బెదిరింపులు

9వ వార్డు సభ్యుడు వెంగళ కనకయ్య

పెద్దపల్లి రూరల్, ప్రభాతవార్త:



పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ గ్రామంలోని హుస్సేమియా వాగు పరిసర ప్రాంతాల్లో ఇసుక, మొరం మాఫియా రెచ్చిపోతుందని 9వ వార్డు సభ్యుడు వెంగళ కనకయ్య అన్నారు. ఎలాంటి పర్మిషన్లు లేకుండా, నిబంధనలను బేఖాతరు చేస్తూ రాత్రింబవళ్లు యం త్రాలు, వాహనాలతో ఇసుక, మొరాన్ని యథే చ్ఛగా తరలిస్తున్నా రన్నారని ఆరోపించారు. దీంతో గ్రామంలోని అంతర్గత రహ దారులు పూర్తిగా దెబ్బతిం టున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాక్టర్ల రాకపోకల వల్ల గ్రామం మొత్తం దుమ్ము, దూళితో నిండి గ్రామస్తులు శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నారని అన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం ఏకంగా స్థానిక శ్మశాన వాటికలోని సమాధులను సైతం తొలగించి, ఇసుకను తరలించుకు వెళ్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల అండదండలతోనే ఈ మాఫియా మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోందని, దీనిపై కలెక్టర్, మైనింగ్ అధికారులకు, తహశీల్దార్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ మాఫియాను అడ్డుకోబోయి నందుకు తనను చంపుతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పెద్దబొంకూర్‌లో సాగుతున్న ఈ అక్రమ దందాను తక్షణమే నిలిపివేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సర్ సవరణపై.. అయోమయం!

ఎస్ఐఆర్ ప్రక్రియపైభయాందోళనలు

ప్రభాత వార్త కోనరావుపేట

కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ



(ఎస్ఐఆర్) ప్రక్రియ దేశవ్యాప్తంగా రాజకీయ చర్చకు దారితీసింది. ఈ ప్రక్రియ లక్యం ఓటరు జాబితాను మరింత ఖచ్చితంగా రూపొందించడమేనని ఎన్నికల సంఘం చెబుతున్నప్పటికీ దీనివల్ల అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోయే అవకాశం ఉందంటూ ప్రతిపక్ష పార్టీలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద వర్గాల ఓటర్లపై దీని ప్రభావం పడే అవకాశముందని ఆరోపిస్తున్నాయి.తెలంగాణలో ఈ నెల 25వ తేదీ నుంచి బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఎలు) ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక ఫారాలను పంపిణీ చేస్తున్నారు. అయితే ఆ ఫారాలను ఎలా నింపాలి..? ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి..? ఏ వివరాలు తప్పనిసరిగా ఇవ్వాలి..? తాము స్థానికంగా నివసిస్తున్నట్లు ఎలాంటి ఆధారాలు చూపించాలి..? అనే అంశాలపై ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతో అయోమయం నెలకొంది. దీంతో తమ ఓటు హక్కు కోల్పోతామేమోనన్న ఆందోళన చాలామందిలో కనిపిస్తోంది.

లోపాలున్నయంటున్న రాజకీయ పార్టీలు

ఇప్పటికే ఓటరు జాబితాలో అనేక లోపాలు ఉన్నాయని ప్రజలు, రాజకీయ పార్టీలు ఆరోపిస్తున్నాయి. ముఖ్యంగా 2002 సంవత్సరానికి ముందు ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లి, పదవీ విరమణ అనంతరం తమ సొంత గ్రామాలకు చేరుకున్న పలువురి పేర్లు ఇప్పటికీ వారు పనిచేసిన ప్రాంతాల ఓటరు జాబితాల్లో కొనసాగుతుండగా గ్రామాల్లో శాశ్వతంగా నివసిస్తున్న స్థానికుల పేర్లు మాత్రం జాబితా నుంచి తొలగించబడిన ఘటనలు ఉన్నాయని పేర్కొంటున్నారు. దీంతో తాము ఎన్నో ఏండ్లుగా గ్రామంలోనే నివసిస్తున్నప్పటికీ దానిని నిరూపించేందుకు ఎలాంటి పత్రాలు సమర్పించాలనే సందిగ్ధత ప్రజల్లో నెలకొంది. ప్రతిపక్ష పార్టీల నాయకుల ఆరోపణల ప్రకారం, ఇలాంటి ప్రక్రియ అమలు చేసిన కొన్ని రాష్ట్రాల్లో అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించబడ్డాయని వారు పేర్కొంటున్నారు. అదే పరిస్థితి తెలంగాణ లోనూ తలెత్తకుండా ఎన్నికల సంఘం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా బలహీన వర్గాల ప్రజలు నిరక్ష ్యం చేయకుండా అధికారులు ఇచ్చే ఫారాలను పూర్తిగా నింపాలని సూచిస్తున్నారు.

బీఎల్ఓలతో సాయం

ఈ నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ కేంద్రంలో బూత్ లెవల్ ఏజెంట్లను (బీఎల్ ఓ లు) నియమించి ఓటర్లకు అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు చేపట్టాయి. ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ఎప్పటికప్పుడు జాబితాలను పరిశీలించాలని తమ కార్యకర్తలకు సూచిస్తున్నాయి. ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల ఓటరు జాబితాలో ఉన్న డూప్లికేట్ నమోదులు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మారిన వారి వివరాల సవరణ వంటి ప్రయోజనాలు ఉంటాయని ఎన్నికల సంఘం చెబుతోంది. దీంతో ఎన్నికల నిర్వహణ మరింత పారదర్శకంగా ఉంటుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

అవగాహన కల్పించకుండ ప్రక్రియ

అయితే మరోవైపు ప్రజల్లో సరైన అవగాహన కల్పించకుండా ప్రక్రియను అమలు చేయడం వల్ల అయోమయం పెరుగుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పేదలు, వృద్ధులు, వలస కార్మికులు, నిరక్షరాస్యులు అవసరమైన పత్రాలు సమర్పించలేక ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశముందని పలువురుఅభిప్రాయపడుతున్నారు. ఎన్ని సార్లు ప్రత్యేక సర్వేలు నిర్వహించినా పాత తప్పిదాలు సరిదిద్దకుండా, ఖీఎక్కడి గొంగళి అక్కడనే" అన్న చందంగా ఎన్నికల కమిషన్ అధికారుల పనితీరు కొనసాగుతోందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి అత్యంత విలువైన హక్కు. అందువల్ల అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు కోరుతున్నాయి. అదే సమయంలో ప్రజలు కూడా అధికారులు అందజేసే ఫారాలను నిరక్ష ్యం చేయకుండా సక్రమంగా నింపి, తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సూచిస్తున్నారు.

ప్రయాణికుల పాట్లు..!

ప్రయాణ ప్రాంగణం లేక ఇక్కట్లు

రోడ్లపై, దుకాణాల ముందు నిలబడుతున్న ప్రయాణికులు

బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేయాలంటున్న ప్రయాణికులు

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:



ప్రభుత్వాలు, పాలకులు మారిన ప్రయాణికుల కష్టాలు మాత్రం తప్పడం లేదు. ఆర్టీసీ బస్సు లో ప్రయాణం చేసేందుకు ప్రధాన కూడలి వద్ద వేచి ఉండేందుకు ప్రయాణ ప్రాంగణం లేకపోవడంతో నిత్యం ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సు వచ్చేవరకు రోడ్లపై, దుకాణాల ఎదుట నిలబడే పరిస్థితి నెలకొంది. కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో ప్రయాణ ప్రాంగణం లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బస్సు కోసం వేసి ఉన్న సమయంలో నిలువ నీడ లేక ఎండకు, వానకు తడుస్తూ ప్రయాణం చేసే పరిస్థితి నెలకొంది. గ్రామంలో సరైన సౌకర్యాలతో ప్రయాణ ప్రాంగణం ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులకు పాలకులకు గ్రామస్తులు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకుంటలేరని గ్రామస్తులు వాపోయారు. జిల్లా సరిహద్దు గ్రామం కావడంతో అటువైపు అధికారులు, పాలకులు కన్నెత్తి చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రయాణికుల సౌకర్యార్థం ప్రధాన కూడలి వద్ద అన్ని సౌకర్యాలతో బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కన్నుల పండువగా పెద్దమ్మ తల్లి పట్నాలు

బోనం ఎత్తుకున్న ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే విజయరమణా రావు

జూలపల్లి,ప్రభాతవార్త:



జూలపల్లి మండలం పెద్దాపూర్,వడ్కాపూర్ గ్రామాల్లో ఆదివారం రోజున శ్రీ పెద్దమ్మ తల్లి బోనాల మహోత్స వంలో తెలంగాణ ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.అనంతరం ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనం ఎత్తుకొని బోనాల పండగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దాపూర్,వడుకాపూర్ గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండా లని ఆయన పెద్దమ్మ తల్లిని వేడుకున్నారు.ఈ కార్యక్ర మంలో పెద్దాపూర్ గ్రామ సర్పంచ్ తొగరు శ్రీనివాస్,వడుకాపూర్ సర్పంచ్ పుల్లూరి ప్రశాంతి వేణుగోపాల్ రావు,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బొజ్జ శ్రీనివాస్,పెసరు స్వామి,సందీప్,కోరేపు సంపత్, వేల్పుల లింగయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బురద రోడ్డుగా మారిన బర్రెంకల కట్ట

❖ రైతుల రాక పోకలకు తీవ్ర ఇబ్బందులు

❖ పట్టించుకోని నాయకులు, ప్రభుత్వాలు

ముస్తాబాద్ ప్రభాత వార్త:

గూడెం గ్రామశివారులోని బోప్ప చెరువు కట్ట కింద నుండి బర్రెంకల కట్టకి వెళ్లే రోడ్డు వర్షాల కారణంగా ఎప్పుడు బురదగా మారుతుంది.వర్షాకాలం వచ్చేసరికి రైతుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వందలాదిమంది రైతులు తమ పంట పొలాలకు వెళ్లే ఈ రోడ్డు ఎప్పుడు బురద కుంటలా మారుతుంది.గతంలో బిఆర్ఎస్ పరి పాలనలో డబర్ రోడ్డును మంజూరు చేశారు. అప్పుడు బిఆర్ఎస్ నాయకులు మంజూరు చేసిన రోడ్డును వేరే వైపు పాయించుకున్నారు. ఇప్పుడు అధికారంలో వున్న నాయకులు, చర్యలు తీసుకొని రోడ్డును మంజూరు చేస్తే వందలా మంది రైతుల సమస్యను తీర్చిన వారవుతారని అక్కడి రైతులు వాపోతున్నారు.



